ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక -144 పేజీలు - 08 వెల - 04/- గురువారం 13 మార్చి 2025

# రాష్ట్రవ్యాప్తంగా వైకాపా యువతపోరు

- ర్యాలీలు, ధర్నాలతో రాష్ట్రంలో ఆందోళన
- విజయవాడలో ఉద్రిక్తంగా మారిన పోరుబాట




**విజయవాడ,మార్చి 12, ఆంధ్ర ప్రగతి** ఫీజుల చెల్లింపుపుపై వైకాపా పిలుపుతో రాష్ట్రవ్యాప్తంగా వైసిపి పోరుబాట పట్టింది. యువత పోరు పేరుతో అన్ని జిల్లాల్లో ధర్నలు, ర్యాలీలు నిర్వహించి వినతిపత్రాలు సమర్పించారు. ఈ క్రమంలో యువత పోరు పేరుతో కలెక్టరేట్‌ను ముట్టడించేందుకు వైసీపీ నేతలు ప్రయత్నించడం తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. వైసీపీ నేతలు జోగి రమేష్, వెల్లంపల్లి శ్రీనివాస్, మల్లాది విష్ణు, దేవినేని అవినాష్, మేయర్ భాగ్యలక్ష్మి, పోతున మహేష్, గౌతమ్ రెడ్డి వైసీపీ నేతలు కలెక్టరేట్ ముట్టడికి వచ్చారు. దీంతో వారిని పోలీసులు అడ్డుకున్నారు. అయితే బారికేడ్స్ తోసుకుని మరీ వైసీపీ నేతలు కలెక్టరేట్‌లోకి వచ్చారు. డౌన్ డౌన్ చంద్రబాబు అంటూ నినాదాలు చేశారు. ఈ క్రమంలో పోలీసులకు వైసీపీ నేతలకు మధ్య తోపులాట చోటు చేసుకుంది. కలెక్టరేట్ మూడు గేట్లను కూడా ఫ్యాన్ పార్టీ నేతలు ముట్టడించారు. మిగతాది 2లో...

# డీలిమిటేషన్‌తో అసెంబ్లీలో 75మంది మహిళలకు చోటు

**మహిళా సాధికారతపై అసెంబ్లీలో సిఎం చంద్రబాబు**



- విద్యాఉద్యోగాల్లో 33శాతం రిర్వ్యేషన్లు మా ఘనతే
- తల్లికి, చెల్లికి ఆస్తులను పంచి ఇవ్వని వ్యక్తి పాలన చేశాడు
- డీలిమిటేషన్‌తో 75మంది మహిళలకు అసెంబ్లీలో చోటు
- మహిళా సాధికారతపై అసెంబ్లీలో సిఎం చంద్రబాబు

**అమరావతి, మార్చి 12, ఆంధ్ర ప్రగతి:** తమ ప్రభుత్వంలో ఏ కార్యక్రమం చేపట్టినా మహిళలను దృష్టిలో పెట్టుకునే చేశామని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. శాసనసభలో మహిళా సాధికా రితపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. ఓవైపు మహిళా దినోత్సవం జరుపుకుంటున్న సమయంలోనే మహిళల పట్ల వివక్షత చూపడం జరుగుతోందన్నారు. ఎన్టీఆర్ టీడీపీ పెట్టినప్పటి నుంచి ఉమెన్ ఎంపవర్‌మెంట్‌కు కృషి చేశారని గుర్తుచేశారు. మహిళా సాధికారిత కోసం నిన్న, నేడు, రేపు టీడీపీ పనిచేస్తుందని స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ సిద్ధాంతం జండర్ ఈక్విటీ ద్వారా ఆడవారికి సమాన అవకాశాలు కల్పించడమని తెలిపారు. మిగతాది 2లో...

# ఇది 140 కోట్ల మంది భారతీయులకు లభించిన గౌరవం

**మారిషస్ దేశ అత్యున్నత పురస్కారం అందుకున్న ప్రధాని మోదీ**

**మారిషస్ లో ప్రధాని మోదీ పర్యటన**



ప్రధాని నరేంద్ర మోదీ మారిషస్ పర్యటన కొనసాగుతోంది. మోదీకి మారిషస్ దేశ అత్యున్నత జాతీయ పురస్కారం ప్రదానం చేశారు. ఈ విశిష్ట పురస్కారాన్ని తాను వినమ్రంగా స్వీకరిస్తున్నానని, మారిషస్ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుకుంటున్నానని మోదీ పేర్కొన్నారు.

మిగతాది 2లో...

# దశల వారీగా ఫీజు రియంబర్స్‌మెంట్

**ఫీజుల చెల్లించకుండా బకాయి పెట్టిన జగన్**

**మండలిలో స్వల్పకాలిక చర్చలో మంత్రి లోకేశ్**



**అమరావతి, మార్చి 12, ఆంధ్ర ప్రగతి:** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను దశలవారీగా చెల్లిస్తామని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. పీజీ విద్యార్థులకు గత ప్రభుత్వం తొలగించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ ను తిరిగి తీసుకువస్తామని ప్రకటించారు. గత ప్రభుత్వమే బకాయిలు పెట్టిందని, దీనిపై చర్చించేందుకు సిద్ధమని సవాల్ చేశారు. సభలో చర్చించకుండా వైకాపా సభ్యులు బయటకు వెళ్లిపోయి తోకముడిచారని ఎద్దేవా చేశారు. మిగతాది 2లో...

# ముగ్గురు ఐపిఎస్‌లపై సస్పెన్షన్ కొనసాగింపు

**- మరో ఆరు నెలలు పొడగించిన ప్రభుత్వం**



**అమరావతి, మార్చి 12, ఆంధ్ర ప్రగతి:** ఏపీలో ముగ్గురు సీనియర్ ఐపీఎస్ అధికారులపై సస్పెన్షన్‌ను ప్రభుత్వం మరో ఆరు నెలలు పొడిగించింది. ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులు, విజయవాడ మాజీ సీపీ కాంతిరాణా , ఐపీఎస్ అధికారి విశాల్ గున్నిని గతంలో సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ గడువు ముగియడంతో సస్పెన్షన్‌ను సెప్టెంబరు 25 వరకు పొడిగిస్తున్నట్టు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. తప్పుడు కేసులో ముంబయి సినీ నటి కాదంబరీ జత్వానీని అరెస్టు చేసి, ఇబ్బందులకు గురిచేసిన వ్యవహారంలో ఈ ముగ్గురిపై పలు అభియోగాలున్నాయి. ముగ్గురూ అఖిలభారత సర్వీసు నిబంధనలు ఉల్లంఘించారన్న అభియోగాలపై రివ్యూ కమిటీ సిఫారసు తర్వాత ఐపీఎస్‌ల సస్పెన్షన్ పొడిగిస్తున్నట్టు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

# సీఐడీ విచారణకు విజయసాయిరెడ్డి

- కాకినాడ పోర్టు వ్యవహారంలో పాత్రధారులు, సూత్రధారులు ఉన్నారన్న విజయసాయి
- కేవీ రావుకు విక్రాంత్ రెడ్డిని తానే పరిచయం చేశానని వెల్లడి
- కేవీ రావుకు, వైవీ సుబ్బారెడ్డికి మంచి సాన్నిహిత్యం ఉందని వ్యాఖ్య



**అమరావతి, మార్చి 12, ఆంధ్ర ప్రగతి:** కాకినాడ పోర్టు వాటాల బదిలీ వ్యవహారంలో కర్త, కర్మ, క్రియ అన్నీ వైసీపీ రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి కుమారుడు విక్రాంత్ రెడ్డేనని మాజీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ కేసుకు సంబంధించి విజయసాయిరెడ్డి సీఐడీ విచారణ కాసేపటి క్రితం ముగిసింది. అనంతరం మీడియాతో మాట్లాడుతూ మిగతాది 2లో...

# అధికారంలో ఉన్నా...ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల వెంటే పయనం....

- ప్రతిపక్షంలో కూర్చోవడం నకు కొత్తేమీ కాదు
- మూడునాలుగేళ్ల తరవాత మళ్లీ మనదే అధికారం
- వైసిపి ఆవిర్భావ వేడుకల్లో జగన్ ఉద్ఘాటన




# చిత్తూరులో కాల్పుల కలకలం



**చిత్తూరు మార్చి 12, ఆంధ్ర ప్రగతి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు జిల్లాలో కాల్పులు కలకలం సృష్టించాయి. లక్ష్మి సినిమా హాల్ సమీపంలో ఓ ఇంట్లోకి దొంగలు చొరబడ్డారు. రెండు తుపాకులతో గాల్లోకి కాల్పులు జరిపి ఇంటి యజమానిని భయపెట్టించారు. వెంటనే యజమాని స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. రెండు తుపాకులు, బుల్లెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

# జనసేన ఆవిర్భావ సభ ‘జయకేతనం’

**మార్చి 14న జనసేన పార్టీ ఆవిర్భావ సభ**

**పిఠాపురం నియోజకవర్గం చిత్రాడ వద్ద సభ**



ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# డీలిమిటేషన్‌తో అసెంబ్లీలో 75మంది మహిళలకు చోటు

మహిళా సాధికారతను మాటల్లో చెప్పడం కాదని.. చేతల్లో చేసి చూపించాలన్నారు. తెదేపాతోనే మహిళా సాధికారత ప్రారంభమైందని చెప్పారు. మహిళలకు ఆస్తిలో హక్కును తొలిసారి ఎన్టీఆర్ కల్పించారని గుర్తుచేశారు. 'తల్లి, చెల్లికి ఆస్తిలో వాటా ఇవ్వని వ్యక్తి గతంలో సీఎంగా ఉన్నారు. ఇచ్చిన ఆస్తిని కూడా వెనక్కి తీసుకునేందుకు కోర్టుకు వెళ్లారు. ప్రజలకు ఆదర్శంగా ఉండాల్సిన వ్యక్తే.. తల్లి, చెల్లికి ఆస్తిలో వాటా ఇవ్వలేదు. మా ప్రభుత్వ హయాంలో తొలిసారి విద్యా, ఉద్యోగాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాం అని చంద్రబాబు అన్నారు.. దీంతో వారు బాగా చదువుకున్నారు.ప్రస్తుతం మహిళలకే ఎదురుకట్నం ఇచ్చే పరిస్థితి వచ్చింది. ఆడబిడ్డ పుడితే రూ.5 వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశాం. స్థానిక సంస్థల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాం. డీలిమిటేషన్ పూర్తయితే సుమారు 75 మంది మహిళలు అసెంబ్లీకి వస్తారని అన్నారు. పసుపు, కుంకుమ కింద రూ.10 వేల చొప్పున రూ.9,689 కోట్లు ఇచ్చాం. మహిళలకు భద్రత, నమ్మకాన్ని కలిగించాం. తెలుదేశం పార్టీ.. తెలుగింటి ఆడపడుచుల పార్టీ. దీపం-2 కింద 3 సిలిండర్లు ఉచితంగా ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. డ్వాక్రాలో మహిళలు రూపాయి పొదుపు చేస్తే నేనూ రూపాయి ఇచ్చాను. డ్వాక్రా సంఘాల మద్దతుతో 50 లక్షల ఎకరాల్లో ప్రకృతి సేద్యం చేస్తాం. రాజధాని కోసం 29 వేల మంది రైతులు 34 వేల ఎకరాలు ఇచ్చారు. భూమి అంటే సెంటిమెంట్.. ఎవరూ ఇవ్వడానికి ఇష్టపడరు. ప్రపంచంలో ఎక్కడా జరగని విధంగా 34 వేల ఎకరాలు స్వచ్ఛందంగా ఇచ్చారు. అమరావతి బతికి ఉందంటే కారణం మహిళలు చూపించిన చొరవ, తెగువేనని అన్నారు. మహిళా సాధికారిత ప్రారంభం అయ్యింది టీడీపీతోనే అని చెప్పుకొచ్చారు. 1986లో మహిళలకు ఆస్తిలో సమాన హక్కులు ఇచ్చారన్నారు. మహిళా విద్యకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చామన్నారు. 1995లో మహిళా ఎంపవర్‌మెంట్ కోసం ఆలోచిస్తూ డ్వాక్రా ఉమెన్ ద్వారా ఎంపవర్ చేయాలని నిర్ణయించామన్నారు. విద్యా, ఉద్యోగాలు, రాజకీయాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇచ్చామని తెలిపారు. దీని వల్ల ఆడబిడ్డలు చదువుకున్నారని... వారు కూడా పనిచేయడం ప్రారంభించారన్నారు. సూర్యకుమారి ఐఏఎస్... ఆమె 1996లో గ్రూప్ వన్ ఆఫీసర్‌గా సెలెక్ట్ అయ్యి ఈరోజు మహిళా శిశు సంక్షేమ శాఖా సెక్రెటరీగా పనిచేస్తున్నారన్నారు. ఆరోజు బెనిఫిషరీ ఈరోజు వారి కోసం పాలసీలు రూపొందిస్తు న్నారని.. ఇది సజీవ సాక్ష్యమని చెప్పుకొచ్చారు. పుట్టిన అమ్మాయి భారం కాదు ఇంటికి మహలక్ష్మి అన్నామని... వారి పేరుతో ఓ 5వేలు డిపాజిట్ చేయించామని తెలిపారు. మగపిల్లలు, ఆడపిల్లలకు తేడాలేదని ఆడపిల్లలకు సైకిళ్లు కొనిచ్చినట్లు చెప్పారు.స్పీకర్‌గా ప్రతిభా భారతికి అవకాశం ఇచ్చామన్నారు. 8 శాతంతో ప్రారంభమైన రాజకీయ రిజర్వేషన్లు స్థానిక సంస్థలలో 33 శాతం అయ్యిందన్నారు. ఆడవాళ్లు మగవాళ్ళకంటే తెలివైన వారని.. ఈ విషయం చాట్ జీపీటీని అడిగినా చెపుతుందన్నారు. అమెరికా లాంటి దేశంలో కూడా మహిళల్లో సమానత్వం లేదన్నారు. ఆర్టీసీలో ఆడ కండెక్టర్‌లు చాలా బాగా పనిచేస్తున్నారని కొనియా డారు. 65 లక్షల గ్యాస్ కనెక్షన్‌లు ఆడబిడ్డలకు ఇప్పించామన్నారు. దీపం 2 కింద మూడు సిలెండర్‌లు ఇస్తున్నామని.. డ్వాక్రా సంఘాలు లేని ఊరూ లేదు, ఇల్లు లేదన్నారు. 50 లక్షల ఎకరాల్లో ప్రకృతి సేద్యం చేస్తామని మహిళల అండ ఉందనే ప్రకటించినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. అయిదు సం.లు అమరావతి మహిళలు ఎంత విరోచితంగా పోరాడారని... వారు చేసిన తప్పేంటి అని అన్నారు. అమరావతి రాజధాని కోసం 29 వేల మంది రైతులు 30 వేల ఎకరాల భూమి రాజధాని కట్టుకోవడానికి ల్యాండ్ పూలింగ్ కింద ఇచ్చారన్నారు. వాలంట్రీగా వచ్చి భూములు ఇచ్చారని.. డెవలెప్మెంట్ చేశాక తిరిగి ప్లాట్‌లు ఇస్తామన్నామని తెలిపారు. ఎక్కడా జరగని ఇలాంటి గొప్ప ప్రయోగం చేస్తే మూడు రాజధానులు అని మూడు ముక్కలు ఆట ఆడారని మండిపడ్డారు. ఇదే అసెంబ్లీలో సమావేశాలు పెట్టి ఈ అసెంబ్లీకి భూమి ఇచ్చిన వ్యక్తులను హింసించారన్నారు. ఇదెక్కడి న్యాయం వాళ్ల భూమి మీద మనం కుర్చున్నామని.. వాళ్ల భూమి మీద మనం పరిపాలిస్తున్నామన్నారు. అయిదే సంవత్సరాలు వారు వీర వనితల్లా పోరాడారని కొనియాడారు. వారి ఇళ్లపై, బాత్ రూంలపై డ్రోన్‌లు ఎగరేస్తే అప్పటి పాలకులను ఏమనాలంటూ్గ ÷ర్ అయ్యారు. న్యాయస్థానం టూ దేవస్థానం పాదయాత్ర చేస్తే వారికి భోజనం చేయడానికి హాలు ఇవ్వకుండా చేస్తే రోడ్డుపై భోజనాలు చేశారన్నారు. మహిళలు చూపిన చొరవవల్లే అమారావతి బ్రతికిందన్నారు. నేడు మరలా ఇక్కడ వారి త్యాగం మూలంగానే సమావేశాలు పెట్టుకోగలుగుతున్నామని.. అమరావతి చరిత్రలో వారి త్యాగం నిలిచిపోతుందని సీఎం వెల్లడించారు.

(మొదటి పేజి తరువాయి)

## రాష్ట్రవ్యాప్తంగా వైకాపా యువతపోరు

చివరకు పోలీసులను తోసుకొని కలెక్టరేట్లోకి ప్రవేశించిన నేతలు.. కలెక్టర్ లేకపోవడంతో డీఆర్ఓకు వినతి పత్రం అందజేశారు. అనంతరం వైసీపీ నేతలు వెల్లంపల్లి శ్రీనివాస్, జోగి రమేష్ మీడియాతో మాట్లాడుతూ.. జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పేద విద్యార్థుల ఆవేదనను కూటమి నాయకుల దృష్టికి తీసుకువచ్చే విధంగా చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఒక ఉద్యమం లాగా విద్యార్థులు,విద్యార్థుల తల్లిదండ్రులు జిల్లా కలెక్టరేట్ కార్యాలయాలకు ముట్టడిస్తున్నామన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ ఇవ్వాలని.. కూటమీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి విద్యార్థులకు అన్యాయం చేస్తోందని విమర్శించారు. ఉచిత ఫ్రీ మెడికల్ కాలేజీలను జగన్ మోహన్ రెడ్డి అందించడానికి శ్రీకారం చుడితే, మెడికల్ సీట్లను అమ్ముకునే కూటమి ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. తమ పిల్లలకు ఫీజులు కట్టడం లేదని, హాల్ టికెట్స్ ఇవ్వటం లేదని, ఎగ్జామ్స్ రాయనివ్వడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారని అన్నారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉంటే బాగుండు అని తమ బాధలు తీరేవని విద్యార్థులు బాధపడుతున్నారన్నారు. వైసీపీ నేతలు అందరం కలిపి ప్రతి జిల్లాలో కలెక్టర్ కార్యాలయాలకు వెళ్లి వినతి పత్రాలు అందిస్తున్నామని వైసీపీ నేతలు పేర్కొన్నారు.

## సీఐడీ విచారణకు విజయసాయిరెడ్డి

ఆయన పలు విషయాలను వెల్లడించారు. కాకినాడ పోర్టు వ్యవహారంలో సూత్రధారులు, పాత్రధారులు ఉన్నారని విజయసాయి అన్నారు. ఈ వ్యవహారంలో కీలక వ్యక్తి విక్రాంత్ రెడ్డి అని చెప్పారు. వైవీ సుబ్బారెడ్డి కుమారుడిగానే విక్రాంత్ రెడ్డి తనకు తెలుసని సీఐడీ అధికారులకు తాను చెప్పానని అన్నారు. కామన్ ఫ్రెండ్ ద్వారా కేవీ రావును విక్రాంత్ రెడ్డికి పరిచయం చేశానని తెలిపారు. పోర్టు యజమాని కేవీ రావుతో తనకు ఎలాంటి లావాదేవీలు లేవని చెప్పారు. వైసీపీ అధినేత జగన్ ను కాపాడేందుకు మీరంతా యత్నిస్తున్నారా? అని సీఐడీ అధికారులు తనను ప్రశ్నించారని... ఈ కేసుతో జగన్ కు సంబంధం లేదని తాను చెప్పానని తెలిపారు.కేవీ రావుకు, వైవీ సుబ్బారెడ్డికి మంచి సాన్నిహిత్యం ఉందని విజయసాయి తెలిపారు. వైవీ సుబ్బారెడ్డి అమెరికాకు ఎప్పుడు వెళ్లినా కాలిఫోర్నియాలో కేవీ రావుకు చెందిన ఒక రాజభవనంలో ఉండేవారని చెప్పారు. పోర్టు వ్యవహారంతో జగన్ కు సంబంధం లేదని అన్నారు. ఇది రాజకీయ ప్రేరేపిత కేసు అని చెప్పారు. ఆది నుంచి అంతం వరకు పోర్టు వాటాల వ్యవహారాన్ని డీల్ చేసింది విక్రాంత్ రెడ్డే అని కామన్ ఫ్రెండ్స్ తో కేవీ రావు చెప్పారని తెలిపారు. ఈ వ్యవహారం గురించి తనకు పూర్తి అవగాహన ఉందని... సమయం వచ్చినప్పుడు అన్ని విషయాలు చెబుతానని అన్నారు. కేవీ రావు రాజకీయ బ్రోకర్ అని... ఆయనంటే తనకు అసహ్యమని చెప్పారు.తాను వ్యవసాయం చేసుకుంటున్నానని... ప్రస్తుతం అదే పనిలో ఉన్నానని విజయసాయి చెప్పారు. గతంలో నాయకుడిపై భక్తి ఉండేదని... ఇప్పుడు దేవుడిపై భక్తి ఉందని అన్నారు. తాను ప్రలోభాలకు లొంగిపోయానని జగన్ అన్నారని... తాను ప్రలోభాలకు లొంగలేదని చెప్పారు. భవిష్యత్తులో తనపై విమర్శలు, ఆరోపణలు చేసినా తాను పట్టించుకోనని అన్నారు.

## దశల వారీగా ఫీజు రియంబర్స్‌మెంట్

విద్యాశాఖలో సంస్కరణలపై శాసన మండలిలో స్వల్ప వ్యవధి చర్చ జరిగింది. ఈ సందర్భంగా విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సమాధానం ఇచ్చారు. జీవో 117 వల్ల 12 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు దూరమయ్యారని లోకేశ్ ఆందోళన వ్యక్తం చేశారు. టీచర్లపై గతంలో పెట్టిన కేసులన్నింటినీ మాఫీ చేసే బాధ్యత ఈ ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. టీచర్లకు యాప్‌ల భారం తగ్గిస్తున్నామని, నోట్ బుక్‌లు, పుస్తకాలు, బెల్టులు, బ్యాగ్‌లు, చిక్కీల పైనా గత సీఎం జగన్ తన ఫొటో ముద్రించుకోగా.. ఇకపై ప్రభుత్వ ముద్రతోనే పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పార్టీ రంగుల్లేకుండా సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరుతో విద్యా కిట్లు ఇస్తామన్నారు. పిల్లలకు యూనిఫాంలు మార్చి.. నాణ్యమైనవి ఇస్తున్నామన్నారు. భారం లేకుండా పుస్తకాల సంఖ్య తగ్గించినట్లు తెలిపారు. పుస్తకాలు, బ్యాగ్‌లపై ప్రభుత్వ లోగో ఉంటుంది కానీ, సీఎం, ఉప ముఖ్యమంత్రి, మంత్రి ఫొటోలు ఎక్కడా పెట్టలేదన్నారు. రాబోయే 5 ఏళ్లలో చిక్కీల కింద రూ. 240 కోట్లు, కోడి గుడ్లపై రూ.144 కోట్లు ప్రభుత్వం సేవ్ చేస్తుందని, చాలా పారదర్శకంగా టెండర్లు పిలిచి ప్రభుత్వ సొమ్ము ఆదా చేశామన్నారు. ప్రతి గ్రామానికి మోడల్ ప్రైమరీ స్కూల్‌ను ఏర్పాటు చేయాలనేది లక్ష్యమన్నారు. 1 క్లాస్ 1 టీచర్ విధానాన్ని అమలు చేయాలన్నది లక్ష్యమని, కేజీ నుంచి పీజీ వరకు సిలబస్ మానిటరింగ్ చేస్తామన్నారు. పుస్తకాల్లో ప్రతి ఛాప్టర్‌కు క్యూఆర్ కోడ్ అమలు చేస్తున్నామన్న లోకేశ్.. ప్రతి శనివారం 'నో బ్యాగ్ డే' గా అమలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. అమరావతిలో ప్రపంచస్థాయిలో టీచర్ ట్రైనింగ్ అకాడమీ ఏర్పాటు చేయాలని ప్రయత్నిస్తున్నామన్నారు. రాష్ట్ర చరిత్రలో తొలిసారి సీనియారిటీ జాబితాను ప్రకటించామని, జాబితాపై అభ్యంతరాలు తీసుకున్న తర్వాత ఆన్‌లైన్ చేస్తామన్నారు. టీచర్ ట్రాన్స్‌ఫర్ యాక్టును అమలు చేస్తామని, డీఎస్సీ నోటిఫికేషన్ తప్పకుండా విడుదల చేస్తామన్నారు. ఈ ఏడాదిలోపే ఉపాధ్యాయులను నియమించే బాధ్యత తీసుకుంటామన్నారు.

### ఇది 140 కోట్ల మంది భారతీయులకు లభించిన గౌరవం

మారిషస్ సోదర సోదరీమణులందరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను అంటూ సందేశం ఇచ్చారు. ఇది నా ఒక్కడికి లభించిన పురస్కారంగా భావించడంలేదని, 140 కోట్ల మంది భారతీయులకు లభించిన గౌరవంగా భావిస్తున్నానని మోదీ పేర్కొన్నారు.

కాగా, మారిషస్ రాజధాని పోర్ట్ లూయిస్ లో మోదీకి నిన్న ఘన స్వాగతం లభించింది. మారిషస్ ప్రధాని నవీన్ రామ్ గులామ్ స్వయంగా ఎయిర్ పోర్టుకు వచ్చి భారత ప్రధానికి స్వాగతం పలకడం విశేషం.

## ఎన్నికల ప్రక్రియను మరింత బలోపేతం చేయడానికి
## రాజకీయ పార్టీల అధ్యక్షులు, సీనియర్ నాయకులకు ఆహ్వానం.

**భారత ఎన్నికల కమిషన్ డైరెక్టర్ అనుజ్ చందక్**


**ఆంధ్ర ప్రగతి నంద్యాల, మార్చి 12:**
దేశంలో ఎన్నికల ప్రక్రియ, ఓటర్ల జాబితాలపై కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ) ఏప్రిల్ 30వ తేదీ నిర్వహించే సమావేశానికి అన్ని రాజకీయ పార్టీల అధ్యక్షులు, సీనియర్ నాయకులను ఆహ్వానిస్తున్నట్లు భారత ఎన్నికల కమిషన్ డైరెక్టర్ అనుజ్ చందక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారులు, జిల్లా ఎన్నికల అధికారులు, చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ల స్థాయిల్లో ఏవైనా పరిష్కారం కాని సమస్యలపై ఏప్రిల్ 30 నాటికి అన్ని జాతీయ, ప్రాంతీయ రాజకీయ పార్టీల నుంచి సలహాలు ఆహ్వానిస్తున్నట్లు భారత ఎన్నికల కమిషన్ తెలిపింది. గత వారం దేశంలోని అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో జరిగిన సమావేశంలో, ప్రధాన ఎన్నికల



కమిషనర్ జ్ఞానేష్ కుమార్ అన్ని రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల సీఈవోలు డిఇఓలు, ఈఆర్ఓ లను రాజకీయ పార్టీలతో క్రమం తప్పకుండా చర్చించాలని అటువంటి సమావేశాలలో వచ్చిన ఏవైనా సూచనలను పరిష్కరించాలని, మార్చి 31, 2025 నాటికి తీసుకున్న చర్యల నివేదికను కమిషన్‌కు సమర్పించాలని ఆదేశించారని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.ఎన్నికల ప్రక్రియ, రాజ్యాంగం అమలులో రాజకీయ పార్టీలు కీలక పాత్ర పోషిస్తాయని, ప్రజాప్రాతినిధ్య చట్టం 1950 %ు% 1951, ఓటర్ల నమోదు నియమాలు, 1960 ఎన్నికల నియమాల నిర్వహణ, 1961 సుప్రీంకోర్టు ఆదేశాలు మరియు భారత ఎన్నికల సంఘం ఎప్పటికప్పుడు జారీ చేసే సూచనలు, మాన్యువల్లు మరియు హ్యాండ్‌బుక్‌లు (%జుజ×% వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి) స్వేచ్ఛగా మరియు నిష్పాక్షికంగా ఎన్నికలు నిర్వహించడానికి వికేంద్రీకృత, బలమైన మరియు పారదర్శక ఎన్నికల ప్రక్రియను ఏర్పాటు ఏర్పాటు చేసినట్లుగా రాజకీయ పార్టీలకు ఇచ్చిన లేఖలో పేర్కొన్నారని తెలిపారు.

## జనసేన ఆవిర్భావ సభ 'జయకేతనం'

**అమరావతి, మార్చి 12, ఆంధ్ర ప్రగతి:** :ఈ నెల 14న జరిగే జనసేన పార్టీ ఆవిర్భావ సభకు 'జయకేతనం' అని పార్టీ అధినేత పవన్ కల్యాణ్ నామకరణం చేశారు. ఈ విషయాన్ని జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. పిఠాపురం నియోజకవర్గంలోని చిత్రాడ వద్ద జనసేన పార్టీ నిర్వహిస్తున్న 'జయకేతనం' సభ రాష్ట్ర చరిత్రలో నిలిచిపోతుందని నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఈ సభకు రాష్ట్రం నలుమూలల నుంచి జనసైనికులు, వీర మహిళలు తరలిరానున్నారని... ఇతర రాష్ట్రాల నుంచి కూడా జనసైనికులు, ముఖ్యంగా తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడుల నుంచి




సైతం పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారని ఆయన పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ నాయకత్వంలో జరిగే ఈ సభ స్థానిక చరిత్ర, సంస్కృతికి అద్దం పట్టేలా ఉంటుందని మనోహర్ తెలిపారు. ఈ ప్రాంతానికి విశేష సేవలందించిన మహానుభావులను స్మరించుకునే విధంగా మూడు ముఖద్వారాలకు వారి పేర్లు పెట్టామని ఆయన వెల్లడించారు. తొలి ద్వారానికి పిఠాపురం మహారాజు శ్రీ రాజా సూర్యరావు బహదూర్ పేరు పెట్టామని తెలిపారు. ఆయన విద్యాభివృద్ధికి, సేవా కార్యక్రమాలకు ఎనలేని కృషి చేశారని వివరించారు. రెండవ ద్వారానికి రాష్ట్రవ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికులకు సహాయం చేసిన డొక్కా సీతమ్మ పేరు పెట్టామని వెల్లడించారు. ఇక మూడవ ద్వారానికి విద్యాసంస్థలు స్థాపించి చరిత్ర సృష్టించిన మల్లాది సత్యలింగం నాయకర్ పేరు పెట్టడం జరిగిందని తెలిపారు. ఈ ముగ్గురు మహానుభావులు ఆయా ప్రాంతాలకు చేసిన సేవలను స్మరించుకుంటూ, వారి స్ఫూర్తిని భావితరాలకు అందించే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు మనోహర్ పేర్కొన్నారు.

భారతదేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రజలు జనసేనకు అఖండ విజయాన్ని అందించారని మనోహర్ అన్నారు. పోటీ చేసిన ప్రతి స్థానంలో జనసేన విజయం సాధించిందని, ఇది జనసైనికులు, వీర మహిళలు, నాయకుల నిస్వార్థ సేవలకు ఫలితమని ఆయన కొనియాడారు.

ఈ విజయాన్ని పురస్కరించుకుని, పవన్ కళ్యాణ్ గారికి కృతజ్ఞతలు తెలుపుతూ, పిఠాపురం ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసేందుకు ఈ సభను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మార్చి 14న జరిగే ఈ సభలో

## అధికారంలో ఉన్నా... ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల వెంటే పయనం

**అమరావతి, మార్చి 12, ఆంధ్ర ప్రగతి:**
అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా.. వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ ప్రజలకు అండగా ఉంటుందని, ప్రజా సమస్యలపై పోరాడుతూనే ఉంటుందని పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ 15వ ఆవిర్భావ వేడుకలు బుధవారం ఏపీ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ క్రమంలో తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన వేడుకలకు హాజరైన వైఎస్ జగన్.. మహానేత వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించి, పార్టీ జెండా ఆవిష్కరించి ప్రసంగించారు. వైఎస్సార్‌సీపీ ఇవాళ 15వ ఆవిర్భావ దినోత్సవం జరుపుకుంటోంది. ప్రజల కష్టాల నుంచి వైఎస్సార్‌సీపీ పుట్టింది. ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించి పోరాడుతోంది. ప్రతిపక్షంలో కూర్చోవడం మనకు కొత్త కాదు. అధికారంలో ఉన్నవాళ్లకు ఎప్పటికప్పుడు ధీటైన సమాధానమే ఇస్తున్నాం. ప్రజా సమస్యలపై పోరాడుతూనే ఉంటామని అన్నారు. జగన్ చెప్పాడంటే.. చేస్తాడంతే అనే నమ్మకం ప్రజల్లో ఏర్పడింది. ఇవాళ ప్రజల్లోకి ధైర్యంగా కాలర్ ఎగరేసుకుని వెళ్లగలిగే స్థితిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఉన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రజలకు ఎప్పుడూ అండగా ఉంటుంది. 3-4 ఏళ్ల తర్వాత మళ్లీ అధికారంలోకి వచ్చేది మనమే అని రు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టిన ఆయన.. ఇవాళ వైఎస్సార్‌సీపీ చేపట్టిన ఫీజు పోరు గురించి ప్రస్తావించారు. ఈ వేడుకల్లో పార్టీ ముఖ్యనేతలంతా పాల్గొన్నారు. ప్రజాభ్యుదయమే పరమావధిగా ఎదుగుతున్న వైఎస్సార్‌సీపీ సవాళ్లనే సోపానాలుగా మార్చుకుంది. ప్రజాసమస్యల పరిష్కారంపై మడమ తిప్పకుండా పోరాటాలు చేస్తోంది. మహానేత వైఎస్సార్ ఆశయ సాధన లక్ష్యంగా ముందుకు సాగుతోంది. ఈ క్రమంలోనే రాజకీయాల్లో నైతిక విలువలను చాటిచెప్పిన వైఎస్ జగన్ 'నేను విన్నాను.. నేను ఉన్నానంటూ' ప్రజలకు భరోసా ఇస్తున్నారని అన్నారు. దేవుని దయ, ప్రజలందరి చల్లని దీవెనలతో నేడు 15వ ఏట అడుగుపెడుతున్నాం. కోట్లాది మంది ప్రజలు ఆకాంక్షల దిశగా అడుగులు వేసిన పార్టీగా వైసిపసి అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. ప్రజల ఆశలకు ఒక రూపం ఇచ్చిన ఘనత పార్టీ సభ్యులదన్నారు. ఈ మూడేళ్ళలోనే.. మూడు దశబ్దాల అభ్యుదయం కన్పిస్తోందన్నారు. అధికారం కోసం కొట్లాడే రాజకీయం కాకుండా సేవ చేయడంలో పోటీ చూపిస్తోంది కాబట్టే ఇంత ప్రజాదరణ దక్కుతోంది అన్నారు. జగన్ పాలనలో సంక్షేమానికి గట్టి పునాది వేశాం. అది మన నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే సాధ్యమైందని సజ్జల అన్నారు. ప్రతి కుటుంబం కుంగిపోతున్న తరుణంలో.. విద్యా, వైద్యం అందిస్తూ సమగ్ర మార్పునకు కృషి చేశారు. చదువు కొనాల్సిన అవసరం లేకుండా.. చదువుకునే పరిస్థితి రాష్ట్రంలో వచ్చింది. రాజకీయంగా అన్ని వర్గాలకు సాధికారత తీసుకొచ్చాం. మహిళలకు నిజమైన సాధికారత దిశగా అడుగులు వేశామని సజ్జల పేర్కొన్నారు.మనకు ప్రత్యర్థులు ఎవరూ లేరు...ప్రజల్ని మోసం, దగా చేసే వారే ప్రజలకు ప్రత్యర్థులు. అటువంటి వారి కుయుక్తులకు చెక్ పెట్టాలి. మిగిలిన పార్టీలకు మనకు పొంతన లేదు. శాశ్వతంగా ప్రజల మన్ననలు పొందేలా నిలబడే పార్టీ మనది.ప్రజల జీవితంలో మమేకం అయిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు' అని సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
గురువారం 13 మార్చి 2025

# వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో హోరెత్తిన... యువత పోరు..!






-విద్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్ బాకాయిలను, యువతకు నిరుద్యోగ బృతి వెంటనే చెల్లించాలి.

-మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి, వైఎస్ఆర్సిపి నేతలు.

-విద్యార్థులు, నిరుద్యోగుల పక్షాన నిలిచిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీనేతలు.

-చంద్రబాబు సర్కార్ పై నిరసన గళం విప్పిన విద్యార్థి సంఘాల నేతలు.

-యువత పోరు కార్యక్రమానికి భారీగా తరలివచ్చిన విద్యార్థులు, యువత.

-జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియాకు డిమాండ్లతో కూడిన వినతి పత్రం.

ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 12:
వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలలో జిల్లా కేంద్రాలలో యువత పోరు కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. బుధవారం నంద్యాల జిల్లా కేంద్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అధ్యక్షతన నంద్యాల జిల్లా పరిదిలోని అన్ని నియోజక వర్గాల ఇంచార్జిలు, మాజీ ఎమ్మెల్యేలు, జెడ్పీ చైర్మన్, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు, సర్పంచ్లు, వివిధ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు ప్రజలు యువత పోరు కార్యక్రమంలో పాల్గొని అనంతరం నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియాకు విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని, నిరుద్యోగ యువతకు కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాన్ని అమలు చేయాలని, నిరుద్యోగ బృతి చెల్లించాలని లేదా ఉద్యోగాలను కల్పించాలని పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేయడం జరిగింది. కూటమి ప్రభుత్వం విద్యార్థుల భవిషత్తుతో చెలగాటం ఆడవద్దని, మెడికల్ కళాశాలను ప్రైవేట్ పరంచేయరాదని, ప్రభుత్వమే నిర్వహించాలని కోరడం జరిగింది. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వైఎస్సార్సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు యువత పోరు కార్యక్రమం వివరాలను తెలిజేస్తూ, కూటమి ప్రభుత్వం తీరును తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో మాజీ మాజీ ఎమ్మెల్యేలు శిల్పారవిచంద్రకిషోర్ రెడ్డి, శిల్పా చక్రపాణిరెడ్డి, కాటసాని రామిరెడ్డి, గంగుల బిజేంద్రారెడ్డి, డా. సుధీర్, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాబున్నీసా, ఎంపీపీ శెట్టి ప్రభాకర్, నంద్యాల జిల్లా వైఎస్సార్సీపీ ఉపాధ్యక్షులు దాల్ మిల్ అమీర్ బాష, సూర్యనారాయణరెడ్డి, పాల్గొన్నారు.

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ.... కూటమి ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నదని, అధికారం చేపట్టిన నాటి నుండి విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్ మెంట్ బాకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగ సమస్యను రూపుమాపుతామని 20లక్షల ఉద్యోగాలను కల్పిస్తామని లేనిపక్షంలో నిరుద్యోగ యువతకు నెలకు 3వేల రూపాయల బృతిని చెల్లిస్తామని మోసపు వాగ్దానాలు, బూటకపు మాటలతో యువతను మోసం చేశారని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని చెప్పి అందులో కేవలం సామాజిక పెన్షన్ మాత్రమే ఇవ్వగలిగారని మిగతావాటిని గాలికి వదిలేశారని అన్నారు. తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం వంటి అనేక పథకాలు అమలుకు నోచుకోలేదన్నారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 17 మెడికల్ కళాశాలను మంజూరు చేస్తే అందులో ముందస్తుగా 5 కళాశాలను ప్రారంభించడం జరిగిందని, మిగతా 12 మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణ చేసేందుకు కూటమి ప్రభుత్వం సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు. కేటాయించిన మెడికల్ సీట్లు తమకు వద్దని చెప్పడం జరిగిందని దీనిని రాష్ట్ర ప్రజలు గమనించాలన్నారు. కూటమి నేతలు మోసపు, బూటకపు హామీలతో గెలిచారని, నాడు ప్రజలు కూటమి పార్టీలపై నమ్మకంతో ఓట్లు వేశారని, నేడు ఉన్న దుస్థితి ప్రజలు గ్రహించాలని కోరారు. మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజాసంక్షేమ పథకాలను ఇస్తుంటే రాష్ట్ర శ్రీలంకగా మారిపోతుందని విమర్శించారని, నేడు సంపద సృష్టిస్తామన్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఏమి చేశారని సూటిగా ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వానికి ప్రజల మీద ప్రేమలేదని, సూపర్ సిక్స్ పథకాలు ఉసేలేదని అన్నారు. దివంగత ముఖ్యమంత్రి డా. వైఎస్సార్ పేద విద్యార్థుల బంగారుభవిషత్తు కోసం ఫీజు రీయింబర్స్ మెంట్ పథకాన్ని అమలు చేస్తే ఆయన తనయుడు మరో నాలుగు అడుగులు ముందుకు వేసి విద్యాదీవెన, వసతి దీవెన, విదేశీదీవెన వంటి బృహత్తర పథకాలను అమలు చేశారని విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపారని గుర్తు చేశారు. అయితే ఈ కూటమి ప్రభుత్వం విద్యార్థుల భవిషత్తును నాశనం చేస్తుందని విమర్శించారు. వేంటనే కూటమి ప్రభుత్వం విద్యార్థులకు నేటికి చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని, నిరుద్యోగ బృతి చెల్లించాలని లేదా ఉద్యోగాలను కల్పించాలని డిమాండ్ చేశారు.

## అహోబిలంలో భద్రత చర్యలను పరిశీలించిన అడిషనల్ ఎస్పీ ఎన్. యుగంధర్ బాబు.





ఆంధ్ర ప్రగతి ఆళ్లగడ్డ మార్చి 12:
ఆళ్లగడ్డ సబ్ డివిజన్ పరిధిలోని అహోబిలం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 4వ తేదీ నుండి 15వ తేదీ వరకు అంగరంగ వైభవంగా జరుగుచున్నాయి. ఈ బ్రహ్మోత్సవాలలో భాగంగా నేడు శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం సందర్భంగా ప్రజలు ఎక్కువగా తరలివచ్చి కళ్యాణాన్ని వీక్షించడం జరుగుతుంది. కావున నంద్యాల జిల్లా అడిషనల్ ఎస్పీ ఎన్.యుగంధర్ బాబు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత చర్యలను ఏర్పాటు చేసి వాటిని పర్యవేక్షించడం జరిగింది. శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవానికి ప్రజలు, అధికారులు, ప్రజా ప్రతినిధులు రానున్న సందర్భంగా ఎలాంటి ట్రాఫిక్ అంతరాయం లేకుండా సిబ్బందిని ఏర్పాటు చేయడం జరిగింది. మోటార్ బైకులు, ఆటోలు, కార్లు మొదలగు వాహనాల కొరకు ప్రత్యేక పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేయడం జరిగింది.ఎగువ మరియు దిగువ అహోబిలం టెంపుల్ క్యూలైన్లు, కళ్యాణోత్సవం జరుగు ప్రదేశంలోని వీఐపీ గ్యాలరీలు మరియు జనరల్ గ్యాలరీలు, ఎంట్రీ మరియు ఎగ్జిట్ లను వాహనాల పార్కింగ్ మొదలగు ప్రదేశాలను అడిషనల్ ఎస్పీ స్వయంగా పర్యటించి భద్రతా చర్యలను పరిశీలించడం జరిగింది.శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవానికి ఎలాంటి అంతరాయం లేకుండా మరియు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మీకు అప్పగించిన ప్రదేశాలలో విధులు నిర్వహిస్తూ నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అధికారులను సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ గారితో పాటు ఆళ్లగడ్డ డి.ఎస్.పి ప్రమోద్, రూరల్ ఇన్స్పెక్టర్ మురళీధర్

## సెక్షన్ 22 ఏ1 భూముల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోండి.

-జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.



ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 12:
సెక్షన్ 22 ఏ1 భూములు, చుక్కల భూముల పరిష్కారం పై స్వీకరించిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా అధ్యయనం చేసి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ తో కలిసి సెక్షన్ 22 ఏ1 భూములు, చుక్కల భూములు నిషేధిత జాబితాలో నుండి తొలగింపుపై జిల్లాస్థాయి స్క్రుటినీ కమిటీ సమావేశం జరిగింది. నంద్యాల ఆర్డీఓ విశ్వనాధ్, డోన్ ఆర్డిఓ నరసింహులు సంబంధిత మండల తాసిల్దార్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ సెక్షన్ 22 ఏ1 భూములు, చుక్కల భూముల పరిష్కారం పై వచ్చే ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా చర్యలు చేపట్టేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని రెవెన్యూ డివిజనల్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న సెక్షన్ 22 ఏ1 భూములు, చుక్కల భూములను నిషేధిత జాబితాలో తొలగించేందుకు 24 దరఖాస్తులను స్వీకరించారని ఇందుకు సంబంధించి ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన వాళ్లందరికీ న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. గత నాలుగు సంవత్సరాల నుంచి పెండింగ్లో ఉన్న చుక్కల భూములు, సెక్షన్ 22 ఏ1 భూములను పరిశీలించి అర్హతను బట్టి నిషేధిత జాబితాలో నుండి డీనోటిఫై చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్డీవోలు మండల తాసిల్దార్లను కలెక్టర్ ఆదేశించారు.

## జిల్లా బీసీ వెల్ఫేర్ అవినీతిపై ఏసీబీ, విజిలెన్స్ వారి తో విచారణ జరిపించాలి.

-విద్యార్థుల దొంగ హాజరుల తో ప్రభుత్వ సొమ్ము ను స్వాహా చేస్తున్న బీసీ వెల్ఫేర్ వార్డెన్లు అధికారులు.



ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా మార్చి 12:
నంద్యాల జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ప్రతి విద్యార్థి పై కమిషన్ వసూలు చేసి ఇస్తున్న వార్డెన్లు,ఈ సందర్భంగా రాయలసీమ స్టూడెంట్స్ అసోసియేషన్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు బందేల ఓబులేసు , డెమోక్రటిక్ విద్యార్థి ,యువజన సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు షేక్ రియాజ్ వారు మాట్లాడుతూనంద్యాల జిల్లాలో విధులలో నిర్లక్ష్యం వహిస్తున్న హాస్టల్ వార్డెన్ ల పై చర్యలు తీసుకోవాలని స్టేట్ బీసీ వెల్ఫేర్ డైరెక్టర్ డా. మల్లికార్జున ఐఏఎస్ కి వినతి పత్రం అందజేయడం జరిగింది.సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక విజయవాడ సిటి తాడిగడప నందు గల స్టేట్ బిసి వెల్ఫేర్ ఆఫీసు నందు రాయలసీమ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బందేల ఓబులేసు డెమోక్రటిక్ విద్యార్థి, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్.రియాజ్ బీసీ వెల్ఫేర్ డైరెక్టర్ డా. మల్లికార్జున కు వినతిపత్రం అందజేయడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో గల బీసీ హాస్టల్ వార్డెన్ లు విధులలో నిర్లక్ష్యం వహిస్తున్నారని, విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం కల్పించకుండా విద్యార్థుల కడుపు కొడుతూ ప్రభుత్వ నిధులు స్వాహా చేస్తున్నారని తప్పుడు విద్యార్థుల హాజరులతో ప్రభుత్వ సొమ్ము కు గండి కొడుతున్నారు అని, ఇటువంటి వార్డెన్ లను సస్పెండ్ చేయాలని అదే విధంగా గతంలో అనేక అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న నంద్యాల జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి లక్ష్మి దేవి ని విధుల నుంచి తొలగించాలని వారు డైరెక్టర్ నీ కోరారు.

# జిల్లా రజక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రజకుల ఆత్మీయ సమావేశం.

**-ముఖ్యఅతిథిగా పాల్గొననున్న రజక ఫెడరేషన్ కార్పొరేషన్ చైర్మన్ సావిత్రి.**



ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 12:
ఈనెల 14 వ తేదీన నంద్యాలలోని రామకృష్ణ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో నంద్యాల జిల్లా రజక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రజకుల ఆత్మీయ సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఏపీ రజక ఫెడరేషన్ కార్పొరేషన్ చైర్మన్ సావిత్రి పాల్గొననున్నారు. ఈ సందర్భంగా రజక జేఏసీ నాయకులు మాట్లాడుతూ నంద్యాల జిల్లాలోని ఉన్నటువంటి అన్ని రజక సంఘాలను కలుపుకొని ఒక జేఏసీగా ఏర్పడి సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్న సందర్భంగా నంద్యాల పట్టణంలోని మరియు పరిసర గ్రామాలలో ఉన్నటువంటి రజకులందరు స్వచ్ఛందంగా అధిక సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రజక జేఏసీ అధ్యక్షులు సురేష్, గౌరవ అధ్యక్షులు జూటూరు పెద్ద వెంకటేశ్వర్లు, నందవరం శ్రీనివాసులు,కార్యదర్శి నాగరాజు, సహాయ కార్యదర్శి రాము తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం.





ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 12: నంద్యాల మండల వ్యవసాయ అధికారి నంద్యాల వారు ప్రసాద రావు రాయమాలుపురం మరియు మునగాల గ్రామాల యందు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వాహించడం జరీగింది. ఈ కార్యక్రామంలో జిల్లా వ్యవసాయ అధికారి నంద్యాల వై. వి.మురళీ కృష్ణ మాట్లాడుతూ రైతుకు ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య గురించి అనగా భూమి గల ప్రతి రైతుకు ఒక ప్రత్యేక రైతు గుర్తింపు సంఖ్యను ఇవ్వడం ద్వారా వ్యవసాయ సేవలను సులభతరం చేసి పారదర్శకంగా మరింత అందుబాటులోకి తీసుకొని రావటం కోసం అలాగే ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ సన్న కారు మరియు చిన్న కారు రైతుల కి వ్యక్తిగతంగా వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు సబ్సిడీ పై మంజూరు చేసింది. ఈ పథకాన్ని రైతులు వినియోగించుకోవాలని తెలపడం మైనది అనంతరం వరి పంటను సందర్శించడం జరిగింది వరి పంటలో తీసుకోవలసిన సస్య రక్షణ చర్యలను రైతులకు వివరించడం జరిగినది.అలాగే వ్యవసాయ సహాయ సంచాలకులు నంద్యాల, రెగ్యులర్ శ్రీ డి.రాజశేఖర్ మాట్లాడుతు రబీ సీజన్ నందు పంట నమోదు చేసిన రైతుల వివరాలు రైతు సేవ కేంద్రం నందు ప్రదర్శించడం జరిగినది ఏమైనా అభ్యంతరం తెలిపినచో వాటిని సరిచేసుకునే అవకాశం కల్పించడం జరిగినదని తెలపడమైనదీ. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నంద్యాల ఈర్ల ప్రసాదరావు, వ్యవసాయ విస్తరణ అధికారి మనోహర్ రైతు సేవ కేంద్ర సిబ్బంధి కిరణ్ కుమార్ రైతులు పాల్గొన్నారు.

## బాల అకాడమి పాఠశాలలో మోటివేషియల్ తరగతులు.





ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ మార్చి 12: నంద్యాల పట్టణంలోని పార్కు రోడ్డు సమీపంలో గల బాల అకాడమి పాఠశాలలో బుధవారం పదవ తరగతి విద్యార్థుల లక్ష్య సాధనకు మరియు ఆత్మ స్థైర్యం నింపేందుకు మోటివేషియల్ కార్యక్రమమును ఏర్పాటు చేయడము జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా పాఠశాల కరస్పాండెంట్ ఎం జీవి రవీంద్రనాథ్ ప్రిన్సిపల్ శ్రీ మతి మాధవిలత మరియు డాక్టర్ గెలివి సహదేవుడు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులు మాట్లాడుతూ పదవ తరగతి పరిక్షలు రాయబోతున్న విద్యార్థులకు పరిక్షల సమయంలో ఆరోగ్య విషయంలో తీసుకోవలసిన జాగ్రతలు, ఎక్కువ మార్కులు సాధించడానికి సహాయ పడే మెళుకువలను, సూచనలను వారి అనుభవాలను విద్యార్థులలో ఆత్మ సైర్యమును నింపెలా చైతన్యవంతమైన విషయాలను విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# మెట్రో నగరాలకు ధీటుగా నెరవాటి మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్.!

**-ఈ నెల 14 న ప్రారంభం.**

**-నెరవాటి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ సక్సెస్ సాధించింది.**

**-ఈ.ఎన్. టి..గైనకాలజీ ఆర్థోపెడిక్ సేవలు అందుబాటులో.**

**-నా చిరకాల కోరికను కొడుకు,కోడలు నెరవేర్చారు.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 12:**
నంద్యాల జిల్లా కావడంతో మెట్రో నగరాలకు పరమితమైన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు నంద్యాలలో ఏర్పాటు చేస్తున్నారు.కనిపించని దేవిడి కంటే కనిపించే దేవుళ్ళు వైద్యులు...నంద్యాల పట్టణంలో ప్రజలు వైద్య పరంగా కొన్ని సేవలు అందుబాటులో లేకపోవడంతో హైదరాబాద్ ,చెన్నై,బెంగళూరు ప్రాంతాల్లో వైద్య చికిత్సలు చేయించుకునేవారు.అత్యాధునిక వైద్య సదుపాయాలు కల్పించడంలో నంద్యాల వైద్యులు ముందుకు వస్తున్నారు.కార్పొరేట్ వైద్యాన్ని నంద్యాల ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నారు.డాక్టర్ నెరవాటి వినోద్ కుమార్,డాక్టర్ నెరవాటి అరుణ కుమారి లు నెరవాటి మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఈ నెల 14 న ప్రారంభిస్తున్నారు. ఈ ఆసుపత్రిలో చెవి,ముక్కు,గొంతు, ప్రసూతి వైద్య సేవలతో పేస్టు ఆర్థోపెడిక్ సేవలను అందుబాటులోకి తీసుకొస్తున్నారు.ఈ సందర్భంగా వైద్యులు వినోద్ కుమార్,అరుణ కుమారి లు మాట్లాడుతూ నంద్యాల పట్టణంలో గాంధీ చౌక్ లో 2004 లో నెరవాటి ఆసుపత్రిని ప్రారంభించి చెవి,ముక్కు,గొంతు,ప్రసూతి వైద్యసేవలు అందించామని అన్నారు.2014 లో డాక్టర్ అరుణ కుమారి సూపర్ స్పెషాలిటీ కోర్స్ చేశారని అన్నారు.10 ఏళ్లలో సంతానం లేనివారికి వైద్య సేవలు చేశారన్నారు. నెరవాటి టెస్ట్ ట్యూబ్ సెంటర్ ఏర్పాటు చేసి35 శాతం విజయం సాధించారని పేర్కొన్నారు.మెట్రో నగరాలకు దీటుగా వృద్ధి సాధించామని అన్నారు.2024 లో 100 పడకలు ఏర్పాటుచేసి నెరవాటి మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి రూపుదిద్దుకుంది అన్నారు.ఈ నేపథ్యంలోనే రైతుబజార్ సమీపంలో ఈ నెల 14 న నెరవాటి మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నీ ప్రారంభిస్తున్నామని అన్నారు.గతంలో చెవి,ముక్కు,గొంతు,ప్రసూతి వైద్య సేవలు ,టెస్ట్ ట్యూబ్ బేబి సెంటర్లు ఉండేవని ఇప్పుడు ఆర్థోపెడిక్ వైద్యసేవలు అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు.డాక్టర్లు సుమన్,ఫతిమాలు వైద్య సేవలు అందిస్తారని అన్నారు.ఆక్సిడెంట్ కేసులు,జాయింట్ రీ ప్లేస్ మెంట్ సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.డాక్టర్ అరుణ కుమారి మాట్లాడుతూ సాదారణ కాన్పులు,డెలివరీ సమయంలో మహిళలు ఇబ్బందులు పడకుండా కాస్మొటిక్ గైనకాలజీ వింగ్ ను ఏర్పాటుచేశామన్నారు.డెలివరీ సమయంలో కుట్లు పడడం,గర్భసంచి జారిపోవడం,యోని లూజు కావడం,కొందరికి మూత్రం పడిపోవడం జరుగుతుందని అన్నారు.ఈ సమస్యలకు ఆపరేషన్ లేకుండా వైద్య సేవలు( కాస్మొటిక్ గైనకాలజి ట్రీట్మెంట్)అందుబాటులోకి తీసుకొచ్చాం అన్నారు.గర్భసంచి సమస్యలకు పొట్టమీద కుట్లులేకుండా లాప్రోసిక్ సర్జరీ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు.సంతానం లేనివారు ఎందరో మా ఆసుపత్రిలో వైద్య సేవలు తీసుకున్నారని అన్నారు.ప్రముఖ వ్యాపారవేత్త,ఆర్యవైశ్య ప్రముఖులు నెరవాటి సత్యనారాయణ మాట్లాడుతూ నంద్యాల ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలనే ఆశయం ఉండేదన్నారు.మెట్రో నగరాల్లో వైద్య సేవలు ఖర్చుతో కూడుకున్నవి అన్నారు.హైదరాబాద్ కు ధీటుగా నంద్యాలలో కార్పొరేట్ స్థాయి ఆసుపత్రి నిర్మించాలనే నా చిరకాల కోరికను కొడుకు,కోడలు తీర్చడం సంతోషంగా ఉందన్నారు.కృషి,పట్టుదలతో




ప్రజలకు మంచి వైద్య సేవలు చేసి మంచిపేరు తెచ్చుకున్నారని ఒక తండ్రిగా,మామగా ఇంతకన్నా నాకు ఏమి కావాలన్నారు.హైదారాబాద్ ఆసుపత్రులకు దీటుగా వైద్యసేవలు అందిస్తారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ గగన్,ప్రముఖ వ్యాపారవేత్త నెరవాటి రవి కుమార్ పాల్గొన్నారు.

# గత వైసీపీ పాలనకు భిన్నంగా టీడీపీ ప్రజా ప్రతినిధుల స్పందన

**-సీనియర్ జర్నలిస్టు**

**యం. వి. రమణారెడ్డి,విశ్లేషణ.**

ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 12:
మా ప్రజా ప్రతినిధులు మా ప్రాంత సమస్యపై స్పందించి పరిష్కారం చూపుతారన్న ఆశ రైతులు, ఉద్యమకారుల్లో ఉంటుంది.అయితే గత వైసీపీ పాలనలో ప్రజల సమస్యలు, ప్రాంత సమస్యలు ప్రజా ప్రతినిధులకు చెప్పుకునే వాతావరణం ఉండేది కాదు. రైతు ఉద్యమకారులతో కలిసి ప్రాంత సమస్యలు వైసీపీ ప్రజా ప్రతినిధుల వద్దకు వెళ్లి వివరించి పరిష్కారం చూపాలని కోరినప్పుడు కొందరు ఎమ్మెల్యేలు వారి ఇబ్బందులు ఉద్యమకారులతో, రైతులతో పంచుకుంటూ మాకే మా సీఎం అపాయిట్మెంట్ దొరకడం లేదు మన ప్రాంత సమస్యలు, రైతుల కష్టాలు మాకు తెలిసినా పరిష్కారం చూపేందుకు అవకాశం లేదని వారి అంతర్గత ఆవేదన వారి వద్దకు వెళ్లిన వారికీ చెప్పేవారు.నంద్యాల జిల్లా లో అందుకు భిన్నంగా ఈ 10 నెలల టీడీపీ పాలనలో మంత్రులు బి సి జనార్ధన్ రెడ్డి, ఎన్ ఎం డి ఫరూక్, ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యే లు బుడ్డా రాజశేఖర్ రెడ్డి, భూమా అఖిల ప్రియ, గౌరు చరిత, గిత్తా జయ సూర్య, కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డిలు స్థానిక, ప్రాంత, రైతు సమస్యలపై వెంటనే స్పందించి వాటి పరిష్కారం కోసం పనిచేస్తున్నారు. కేసి కెనాల్ ఆయకట్టుకు నీటి కష్టం రాగానే వెంటనే రైతులకు నష్టం జరగకూడదని రాష్ట్ర



నీటిపారుదల శాఖ మంత్రి, ముఖ్య కార్యదర్శి వద్దకు వెళ్లి కేసి కెనాల్ కు నీటి విడుదల కొనసాగేలా చేసి రైతులకు ధైర్యం కలిగించారు. ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానయుడు రాయలసీమ నీటి విషయం, సిద్దేశ్వరం వద్ద అలుగు నిర్మాణం పై ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు వ్యతిరేక స్పందనపై అసెంబ్లీలోనే మంత్రి ఎన్ ఎం డి ఫరూక్ సార్ ఆలా అనవద్దు, తప్పకుండా పనిచేస్తాం కాదు అనిమాత్రం అనవద్దు మమ్మల్ని ప్రజలు ఇబ్బంది పెడతారు అని నిర్మొహమాటంగా చెప్పారు. సిద్దాపురం ( బుడ్డా వెంగళరెడ్డి సాగర్ ) ఆయకట్టుకు, ప్రజల తాగునీటీ పరిష్కారం కోసం వెలుగోడు రిజర్వాయర్ ద్వారా నీటి విడుదల, అదనంగా 5,500 ఎకరాల ఆయకట్టు విస్తరణకు వెంకటాపురం గ్రామ పై భాగంలో సాగునీటి కొత్త పంట కాల్వ మంజూరు కు, శ్రీశైలం అభివృద్ధికి, సుండిపెంట గ్రామ పంచాయతీ ఏర్పాటుకు, మహానంది దేవస్థానం అభివృద్ధికి సుమారు రూ. 300 కోట్లు సాధించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ను ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి కలిసి వాటిని సాధించి, అవసరమైన అనుమతులు, నిధులు సాధించారు. బేతంచెర్ల లో నాపరాతి పరిశ్రమల యాజమాన్యం దీక్ష చేస్తుంటే ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యే కోట్ల వెళ్లి వారికి హామీ ఇచ్చి దీక్ష విరమించారు. ఆళ్లగడ్డలో కొత్త పరిశ్రమలు ఏర్పాటు, తెలుగుగంగా, కేసి కెనాల్ ఆయకట్టుకు సాగునీరు సాధించేలా భూమా అఖిల ప్రియ సీఎం కలిసి పరిష్కారం చూపుతున్నారు.
జొన్న పంటకు గిట్టుబాటు ధర కోసం, తదితర సమస్యల పరిష్కారం కోసం మంత్రులు బి సి జనార్ధన్ రెడ్డి, ఎన్ ఎం డి ఫరూక్, ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకొని పోయారు.
ఇలా వారి నియోజకవర్గం పరిధిలోనీ సమస్యలపై టీడీపీ మంత్రులు, ఎమ్మెల్యేల స్పందన రైతులకు భరోసా నిస్తోంది. అయితే ఇదే స్ఫూర్తి రాయలసీమ సమస్యలపై ఎంపీ, ఎమ్మెల్యే లు పెట్టి పెండింగ్ లో ఉన్న భారీ, మధ్య, చిన్న సాగునీటి ప్రాజెక్టు ల పూర్తికి సీఎం చంద్రబాబు పై వత్తిడి పెంచాలని రాయలసీమ ఉద్యమకారులు కోరుతున్నారు. వచ్చే నాలుగున్నర సంవత్సరాలు టీడీపీ ఎంపీ ఎమ్మెల్యే లు శాశ్వత పథకాలు సాధిస్తూ, ప్రజలకు మేమున్నాం అన్న ధైర్యం కల్పించాల్సిన అవసరం ఉంది.

# నంద్యాల జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు.

**-తెలియజేసిన ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు.**

ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా మార్చి 12:
జిల్లాలో వెంటనే పంట కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి. నిన్న జరిగిన అసెంబ్లీ సమావేశాల సందర్భంగా నంద్యాల జిల్లా రైతాంగం ఎదుర్కొంటున్న జొన్న, వరి,మిర్చి లాంటిపంట ల మద్దతు ధరల సమస్యపై నంద్యాల జిల్లా లోని మంత్రులు మరియు ఎమ్మెల్యేలు అందరూ కలిసి ముఖ్యమంత్రి తో మరియు వ్యవసాయ శాఖ మంత్రి తో కలిసి మద్దతు ధరల సమస్య పరిష్కరించమని కోరినందుకు గాను వారికి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నంద్యాల జిల్లా కమిటీ నుంచి సంఘం జిల్లా కార్యదర్శి ఏ.రాజశేఖర్ , జిల్లా సహాయ కార్యదర్శి టీ.రామచంద్రుడు అభివందనములు ప్రకటన ద్వారా తెలిపారు. అంతేకాకుండా జిల్లాలోని అన్ని మండలాల్లో వెంటనే జొన్న, వరి, మిర్చి పంటలకొనుగోలు కేంద్రాలువెంటనే ఏర్పాటు చేసి మద్దతు ధరకు కొనుగోలు చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఖరీఫ్ సీజన్లో వేసిన ధాన్యం రైతులు మద్దతు ధర లు





అమలు జరగక, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేక పోవడం వల్ల తీవ్రంగా నష్టపోయారు. అందువల్ల రబీసీజన్ ప్రారంభానికి ముందే కొనుగోలు కేంద్రాలు జిల్లాలో ఏర్పాటు చేయించగలరని,అలాగే తెలుగు గంగా, కేసీ కెనాల్ కాల్వల కింద పంటలు పూర్తిగా పండేవర అన్ను సాగునీరు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేలకు వారు విజ్ఞప్తి చేశారు.

# స్పోకెన్ ట్యుటోరియల్ ఐఐటి ఆన్లైన్ కోర్సు అవగాహన సదస్సు.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 12:**
నంద్యాల పట్టణంలోని శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాల నందు స్పోకెన్ ట్యుటోరియల్ ఐ ఐ టి బొంబాయి వారు ఆన్లైన్ కోర్సు పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ రామకృష్ణ విద్యా సంస్థల చైర్మన్ ప్రొఫెసర్ జి.రామకృష్ణ రెడ్డి, ఈ కోర్సు సంబంధించి కన్వీనర్ గా ఉన్న కళాశాల అధ్యాపకులు మాధవరెడ్డి ,ప్రత్యూష మరియు ఆన్లైన్ కోర్సు అభ్యసించే విద్యార్థులు పాల్గొన్నారు. శ్రీ రామకృష్ణ విద్యా సంస్థల చైర్మన్ ప్రొఫెసర్ జి. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఈ స్పోకెన్ ట్యుటోరియల్ ఐఐటి బొంబాయి వారు మనతో అంగీకార పత్రం కలిగి ఉన్నారు, వారు మనకి ఉచితంగా ఆన్లైన్ కోర్స్ ప్రతి సంవత్సరం అందిస్తారు, మీరు దీనికి ఎటువంటి డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదు ఉచితంగా ప్రతిసారి మనకి అందిస్తారు దీనిని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి, దీనివల్ల మీకు సరియిన అవగాహనతో కూడిన విద్యతో పాటు ఉద్యోగ అవకాశాలకు కూడా





ఉపయోగపడుతుంది అలాగే మీరు కూడా ఒక కోర్సుని నేర్చుకున్నట్లు ఉంటుంది అని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు దీనిని ఈసారి కన్వీనర్ గా మాధవరెడ్డి సార్ మరియు ప్రత్యూష మేడం విద్యార్థులను తీసుకొని వారికి ఆన్లైన్ కోర్స్ గురించి తెలియజేసే భాధ్యత వహించారు. విద్యార్థులు కూడా ఎంతో ఉత్సాహంగా ఆన్లైన్ క్లాసెస్ విని ఆన్లైన్ కోర్స్ పూర్తిచేసి 27 మంది విద్యార్థులు సర్టిఫికెట్లని అందజేసుకున్నారు. ప్రతి ఒక్కరూ ఇలాగే ఈ ఆన్లైన్ కోర్స్ నీ వినియోగించుకోవాలి అని కన్వీనర్ తెలియజేశారు.

# కంటి దృష్టిని నిశ్శబ్దంగా చంపే వ్యాధి గ్లకోమా

**ఆంధ్ర ప్రగతి మహానంది మార్చి 12**

కంటి దృష్టిని నిశ్శబ్దంగా చంపే వ్యాధి గ్లకోమా అని నంద్యాల జిల్లా అంధత్వ నివారణ సంఘం కంటి వైద్య అధికారి డా.జి. కృష్ణమోహన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మహానంది మండలం గోపవరం గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో గ్లకోమా వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.ఆర్ వెంకటరమణ, ఆందోళన నివారణ సంఘము అధికారి డా. మాధవి లత ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రపంచవ్యాప్తంగా గ్లకోమావ్యాధి వారోత్సవాలు, మార్చి 9 వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నిర్వహిస్తున్నారని,గ్లకోమా వ్యాధి రహిత ప్రపంచ కొరకు ప్రతి ఒక్కరు ఐక్యమత్యంగా ఉండాలన్నారు. కంటిశుక్లాల తర్వాత, అత్యంత ప్రమాదకరమైన కంటి వ్యాధి గ్లకోమా వ్యాధి అన్నారు. గ్లకోమా వ్యాధి కంటిలో ఇంట్రా ఆక్యులర్ ప్రెషర్ అనగా, నీటి ఒత్తిడి




క్రమంగా పెరుగుతూ, కంటి నరాలు క్షీణించి దెబ్బతిని, చివరికి అందత్వం కలిగించే వ్యాధిని గ్లకోమా, లేక నీటి కాసుల వ్యాధి అంటారన్నారు. కంటి దృష్టి లోపం ఏర్పడిన వెంటనే, కంటి వైద్య పరీక్షలు నిర్వహించుకొని, చికిత్సలు చేయించుకొని గ్లాకోమా వ్యాధి రాకుండా నివారించవచ్చు అన్నారు. గ్లకోమ వ్యాధి లక్షణాలు కాంతి దీపం చుట్టూ వలయాకారమంగా, వివిధ రంగులు కనిపించుట, కంటి దృష్టి ఒక గొట్టములో చూసినట్లుగా కనిపించుట, తరచుగా తలనొప్పి వాంతులు కావడం, వికారంగా ఉండటం, కంటి దృష్టిలోపాలు , మసకలగా ఉండటం,కంటిలో నీరు కారటం, ఎరుపుగా, వాపుగా, దురదలు ఉండటం, నొప్పిగా ఉండటం, నలకల పడినట్టు గుచ్చుకున్నట్లు ఉండడం, కళ్ళు బరువుగా ఉండటం వాటి లక్షణాలు అన్నారు. 40 సంవత్సరాలు పైబడినవారు, గ్లాకోమా వ్యాధి వంశపారపర్యం, షుగర్, బిపి వ్యాధి గలవారు, ఎక్కువగా స్టెరాయిడ్స్ మందులు ఉపయోగించటం వలన,కంటిలో నీటి ఒత్తిడి తిరిగి క్రమేపి శాశ్వతంగా, అంధత్వం కలుగుతుందన్నారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి కంటి పరీక్షలు నిర్వహించుకుని వ్యాధిని నిర్ధారణ చేసుకొని సరైన కంటి చికిత్సలు చేయించుకుంటే కంటి దృష్టి లోపం ఏర్పడకుండా నివారించవచ్చు అన్నారు.గాజుల పల్లె వైద్య అధికారి డా. ఏం.వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. కంటి దృష్టి లోపాలు ఏర్పడిన వెంటనే కంటి పరీక్షల నిర్వహించుకొని సరైన చికిత్సలు తీసుకోవాలన్నారు. ప్రధానోపాధ్యాయులు కే. భాస్కర్ మాట్లాడుతూ.. సర్వేంద్రియానం నయనం ప్రధానమన్నారు. ఆకు పచ్చని ఆకుకూరలు కూరగాయలు, మంచి పోషకాహార విలువలు కలిగిన పదార్థాలను ఆహారంగా తీసుకోవాలన్నారు. ఆరోగ్య అధికారి రమేష్ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపిన ఎంవీఆర్పీఎస్ నేతలు.



**ఆంధ్ర ప్రగతి మహానంది మార్చి 12:**వాల్మీకుల ఎస్టీ పునరుద్దరణపై , పార్లమెంట్, అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడిన తెలంగాణ ఎంపీ డి కే అరుణ,ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి లకు మహర్షి వాల్మీకి రిజర్వేషన్ ప్రజా సమితి రాష్ట్ర అధ్యక్షులు బోయ పులికొండన్న రాష్ట్ర సహాయ కార్యదర్శి గాజుల పల్లె జయరామ్ లు కృతజ్ఞతలు తెలిపినట్లు పేర్కొన్నారు. బుధవారం నంద్యాలలోని దేవ నగర్ వాల్మీకి రామాలయం మందిరంలో వాల్మీకి నేతలు మాట్లాడుతూ.. ఆర్థిక, సామాజిక,రాజకీయ వెనుక బాటుతనం,69 ఏళ్లుగా పాలకులు చేసిన వాగ్దానాలు విని మోసపోయామన్నారు. ఇప్పటికైనా పాలకులు న్యాయం చేస్తారనే అనుకుంటున్నామని,2017 డిసెంబర్ 2న అసెంబ్లీలో చేసిన తీర్మానం పార్లమెంటులో ఆమోదం పొందేలా కృషి చేస్తే వారి వెన్నంట వాల్మీకులు నడుస్తారని తెలిపారు. వాల్మీకులను మోసం చేస్తే వారి రాజకీయ పతనం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి మహిళా నేతలు భారతి,పెద్దక్క దేవి,అరుణ,లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ ఉనికి కోసమే యువత పోరు

## - ముద్దం నాగ నవీన్.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 12:**



రాష్ట్రంలో 2024లో జరిగిన ఎన్నికల్లో వైఎస్ఆర్సిపి అధికారం కోల్పోవడంతో వైసిపి ఎక్కడ ఉనికి కూలిపోతుందో అని కేవలం ఉనికి కోసమే యువత పోరు చేపట్టడం జరిగిందని యూనివర్సల్ స్టూడెంట్ యూత్ యూనియన్ (యు.ఎస్.వై.యు) నంద్యాల , కర్నూలు ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు ముద్దం నాగ నవీన్ మండిపడ్డారు.బుధవారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ముద్దం నాగ నవీన్ మాట్లాడుతూ.. యువత జీవితాలను నాశనం చేయాలని జగన్ రెడ్డి కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నాడని. తన హయాంలో నిరుద్యోగ శాతం పెంచి ఇప్పుడు ఫీజు పోరు చేస్తున్నదన్నారు . వైసీపీ ఉనికి కోసమే ఫీజు పోరు అంటూ అసెంబ్లీకి వెళ్లకుండా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుందని మండిపడ్డారు. నిరుద్యోగశాతం పెరగడానికి కారకులైనవారే ఫీజు పోరు అంటూ బయటికి రావడం హాస్యాస్పదమన్నారు. ఏటా జాబ్ క్యాలెండర్ ఇస్తానని చెప్పిన జగన్ మాట తప్పి.. మడమ తిప్పాడని. త్వరలో మెగా డీఎస్సీ ద్వారా 16,347 టీచర్స్ పోస్టులు భర్తీ చేయబోతున్నాం అన్నారు . జగన్ రెడ్డి ఫీజు రీయంబర్స్ మెంట్ రూ.4,271 కోట్లు బకాయిలు పెట్టి విద్యార్థుల జీవితాలతో ఆడుకున్నారని. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మంత్రి లోకేష్ చొరవ తీసుకొని రూ.800 కోట్లు ఫీజు రీయంబర్స్ బకాయిలు చెల్లించారని అలాగే రూ. 352 కోట్లు చిన్న పిల్లలకు అందించే చిక్కీల బకాయిలు చెల్లించారన్నారు . జగన్ రెడ్డి పాలనలో ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లేక విద్యార్థులు సతమతమయ్యారని . కేంద్రం ప్రకటించే పిరియాడిక్ లేబర్ ఫోరం జగన్ హయాంలో నిరుద్యోగం 24 శాతానికి పెరిగిందని చెప్పారు. జగన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో చాలామంది నిరుద్యోగ యువత ఆత్మహత్యలు చేసుకున్నారని. నేడు మరోసారి యువతను తప్పుదారి పట్టిస్తున్నారని మండిపడ్డారు. పరీక్షల సమయంలో ధర్నాలు అంటూ విద్యార్థుల జీవితాలతో ఆటాలాడుతున్నాడని, విద్యార్థులపై జగన్ రెడ్డి కపట ప్రేమ ఒలకబోస్తున్నారన్నారు. పరిశ్రమల కోసం లోకేష్ కాలికి బలపం కట్టుకొని దేశ విదేశాల్లో తిరిగారని. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో, టీచర్స్ ఎన్నికలు పూర్తి స్థాయి మెజార్టీతో గెలిపించామన్నారు . యువత ఇక జగన్ రెడ్డిని నమ్మే పరిస్థితి లేదని తెలిపారు.

# భూమా నాగిరెడ్డి ఆశయ సాధనకు కృషి

## - టిడిపి నాయకులు.



ఆంధ్ర ప్రగతి శిరివెళ్ళ మార్చి 12: మండల పరిధిలోని యర్రగుంట్ల మేజర్ పంచాయతీ గ్రామంలో గల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయంలో మాజీ ఎంపీ భూమా నాగిరెడ్డి8వ వర్ధంతి సందర్భంగా యర్రగుంట్ల తెదేపా నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమా నాగిరెడ్డి భౌతికంగా తమ మధ్య లేకున్నా ఆయన సేవలు ఎప్పటికీ మనసుల్లో నిలిచి ఉంటాయన్నారు.భూమా బాటలోనే ఆశయాలు నెరవేర్చడానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కమతం పుల్లారెడ్డి, నీటి సంఘం అధ్యక్షులు కమతం లక్ష్మిరెడ్డి, ఎద్దుర్ల నాగేశ్వరరావు, కమతం బాలగుర్రెడ్డి, సత్తార్ నాగిరెడ్డి, సద్దాం హుస్సేన్, మండ్ల హుస్సేనప్ప, రంజిత్ రెడ్డి, లింగమయ్య, ఓబులేసు, తెదేపా నాయకులు, భూమా అభిమానులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలి

**-అలరించిన విద్యార్థుల నృత్య ప్రదర్శనలు. -కరస్పాండెంట్ సిధిన్ సాముయెల్.**

ఆంధ్ర ప్రగతి మహానంది మార్చి 12:




విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించేలా కష్టపడి చదువుతూ, తల్లితండ్రుల కలలను సాకారం చేయాలనీ పాఠశాల కరస్పాండెంట్ సిధిన్ సాముయెల్ అన్నారు.బుధవారం మహానంది మండల గాజులపల్లె గ్రామంలోని క్రీస్తు జ్యోతి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అందరిని అలరించాయి.తోటి విద్యార్థుల కేరింతల నడుమ, వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో, గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు,తదితరులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా పదవ తరగతి పరీక్షలు నిర్వహించాలి.

## -కలెక్టర్స్ కాన్ఫరెన్స్ కు పూర్తి స్థాయిలో సిద్ధం కావాలి.

**-స్వర్ణాంధ్ర-స్వచ్ఛంధ కార్యక్రమంలో అందరూ భాగస్వామ్యం కావాలి.-రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్.**

ఆంధ్ర ప్రగతి నంద్యాల, మార్చి 12:




పదవ తరగతి పరీక్షల నిర్వహణను పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అన్ని జిల్లాల జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. బుధవారం విజయవాడ కార్యాలయం నుండి పదవ తరగతి పరీక్షల నిర్వహణ, కలెక్టర్ల కాన్ఫరెన్స్, స్వర్ణాంధ్ర-స్వచ్ఛంధ తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి, జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్ రామునాయక్, జిల్లా అధికారులు తదితరులు వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మాట్లాడుతూ మార్చి 17వ తేది నుండి 31వ తేది వరకు పదవ తరగతి పరీక్షలు నిర్వహించనున్నారని అందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. పరీక్షల నిర్వహణ సమయంలో ఎలాంటి చిన్న పొరపాట్లు జరిగినా సోషల్ మీడియా ద్వారా పెద్ద ఎత్తున ప్రచారం జరిగే అవకాశం ఉన్నందున పొరపాట్లకు తావు లేకుండా పరీక్షలు నిర్వహించాలన్నారు. పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు గాను జిల్లా స్థాయిలో కలెక్టర్, ఎస్పీ సంబంధిత అధికారులతో కోఆర్డినేషన్ సమావేశం ఏర్పాటు చేసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు ఎవ్వరికీ అనుమతి లేదని కేవలం చీఫ్ సూపరింటెండెంట్ కు మాత్రమే అనుమతి ఉంటుందని తెలిపారు. ఓపెన్ స్కూల్ పరీక్షలు కూడా అదే షెడ్యూల్ ప్రకారం పరీక్షలు జరగనున్నందునకు ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని సిఎస్ అన్ని జిల్లాల జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఎటువంటి సందేహాలు వాటి నివృత్తి కోసం రాష్ట్ర స్థాయిలో కమాండ్ కంట్రోల్ రూమ్ (0866 297454) ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.ఈ నెల 24, 25వ తేదీలలో కలెక్టర్స్ కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారని సంబంధిత అజెండా అంశాలపై జిల్లా కలెక్టర్లు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. అదే విధంగా రాష్ట్రంలో ఉన్న జిల్లాలను జోన్ల వారీగా విభజించి జిల్లా, జోనల్ వారీగా ఒక సీనియర్ ఐఎఎస్ అధికారిని ఇంఛార్జిగా నియమించడం జరిగిందన్నారు. కలెక్టర్స్ కాన్ఫరెన్స్ ముందుగా సంబంధిత జిల్లా/జోనల్ ఇంఛార్జిలు సమీక్ష నిర్వహిస్తారన్నారు. ఈ సమావేశాల్లో సాధించాల్సిన లక్ష్యాలు, ఇంకా భవిష్యత్తులో సాధించాల్సిన లక్ష్యాలపై కూడా సమీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. అదే విధంగా జిల్లా కలెక్టర్లు కూడా వారు సాధించిన పురోగతిపై కూడా వివరించాల్సి ఉంటుందన్నారు.

స్వర్ణాంధ్ర-స్వచ్ఛంధ కార్యక్రమంలో భాగంగా ప్రతి మూడవ శనివారం నిర్వహించే కార్యక్రమంలో అన్ని శాఖల సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులను కూడా భాగస్వామ్యం చేయడం వల్ల ప్రజల్లో ఇంకా అవగాహన పెరిగి ప్రజలు పెద్ద ఎత్తున పాల్గనే అవకాశం ఉంటుందన్నారు. ఆ రోజు నిర్వహించిన కార్యక్రమాలను ఎప్పటికప్పుడు సంబంధిత సైట్ లో అప్లోడ్ చేస్తూ ఉండేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సర్వీసులు, రెవెన్యూ అంశాలపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారా లేదా అని పలు మాధ్యమాల ద్వారా ప్రభుత్వం తెలుసుకోవడం జరుగుతుందని ఎక్కడైతే రెండు, మూడు సార్లకు మించి ఒకే అంశం మీద ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటునట్లయితే వీటిని పునరావృత్తం కాకుండా ఆర్డీఓలు/కలెక్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా పి4 సర్వేను కూడా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులతో సమీక్ష నిర్వహిస్తూ స్వర్ణాంధ్ర-స్వచ్ఛంధ కార్యక్రమంలో భాగంగా ప్రతి శాఖలో ఉన్న కీ పారామీటర్స్ ఎప్పటికపుడు లాగిన్ లో అప్లోడ్ చేస్తూ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాను తక్కువ ర్యాంకింగ్ కు తీసుకొస్తే సహించే ప్రసక్తే లేదని కలెక్టర్ అధికారులను, స్పెషల్ ఆఫీసర్లను ఆదేశించారు. అదే విధంగా పి4 సర్వేకు సంబంధించి అందరూ క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి అందరూ పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాజిటివ్ పర్సెప్షన్ కు సంబంధించి ప్రజల నుంచి వస్తున్న ప్రతికూల అంశాలపై సంబంధిత సిబ్బందికి అవగాహన కల్పించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. పదవ తరగతి పరీక్షల్లో ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని, సున్నితమైన సెంటర్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, పరిసరాల్లో జిరాక్స్ సెంటర్స్ మూసి ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద మెడికల్ క్యాంప్స్ ఏర్పాటు చేయాలని డిఎంహెచ్ఓను కలెక్టర్ ఆదేశించారు.

# విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడవద్దు.

## -మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి

ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 12:



కూటమి ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడవద్దని పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ నగదును వెంటనే చెల్లిచాలని నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి డిమాండ్ చేశారు. పేద విద్యార్థులు కళాశాలల్లో ఫీజు చెల్లించకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు వారిని కళాశాల నుండి వెనక్కి పంపిస్తున్నారని వారి భవిష్యత్తు నాశనం అవుతుందని తెలిపారు. యువత పోరు కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ను కలిసిన సందర్భంలో నంద్యాల నియోజకవర్గంలోని పలు సమస్యలను పరిష్కరించాలని కోరడం జరిగింది. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నీసా, ఎంపీపీ శెట్టి ప్రభాకర్, వైఎస్సార్సీపీ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు దాల్మిల్ అమీర్ బాష, మాజీ ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ డా. శశికళరెడ్డి, వైఎస్సార్సీపీ మేధావుల సంఘం నాయకుడు రసూల్ ఆజాద్, వైఎస్సార్సీపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ కార్యదర్శి కారురవికుమార్, తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం విద్యార్థులకు చెల్లిచాల్సిన ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని వారి భవిష్యత్తో ఆడుకోవద్దని అన్నారు. తల్లికి వందనం, నిరుద్యోగ బృతి అమలు ఎక్కడని సూటిగా ప్రశ్నించారు. 20లక్షల ఉద్యోగాలను కల్పిస్తామని చెప్పారని అమలు చేయలేదని విమర్శించారు. వాలంటీర్ వ్యవస్థను నిర్వీర్యం చేశారని అన్నారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తే వాటిని లాక్కునేందుకు కూటమి నేతలు ప్రయత్నిస్తున్నారని, నిర్మాణాలు జరుపకుండా అడ్డుకుంటున్నారని ఇది సమంజసంగా లేదన్నారు. నంద్యాల మండలం కానాల గ్రామంలో పేదలకు ఇచ్చిన స్థలాల విషయంలో ఇలాగే జరిగిందన్నారు. అదేవిధంగా నంద్యాల పట్టణానికి సంబంధించి ఎస్సార్బీసీ కాలనీ సమీపంలో ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో యదేచ్ఛగా మట్టి త్రవ్వకాలను నిర్వహిస్తున్నారని ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృ ష్టికి తీసుకెళ్లడం జరిగిందని, అటువంటి చర్యలకు పాల్పడేవారిని కఠినంగా శిక్షించాలని కోరారు. నందమూరి నగర్-వైఎస్సార్ నగర్ మధ్యలో ఉన్న బ్రిడ్జి నిర్మాణాన్ని త్వరంలో పూర్తి చేసి స్థలాలకు చెందిన వారికి కాంపన్సేషన్ ఇవ్వాలని కోరారు. నంద్యాల మున్సిపాలిటీలో ఇంటి పన్ను మినహాయింపు దృవపత్రాల కొరకు వచ్చిన మాజీ సైనికుడు దౌలత్ ఖాన్ మృతి చెందడం బాధాకరం అని, ఆయన కుటుంబ సభ్యులలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరగా ఈ విషయాన్ని మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం తెలిపిందని, వారికి ఉద్యోగం కల్పించాలని జిల్లా కలెక్టర్ ను కోరారు.

## డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో

# యువత భాగస్వాములు కావాలి

**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 12:**
నంద్యాల పట్టణంలోని శ్రీ రామకృష్ణ అటానమస్ డిగ్రీ కళాశాలలో నష ముక్తు భారత్ అభియాన్ డ్రగ్స్ వినియోగము దుష్పరిణామాలు అంశాలపై బుధవారం జరిగిన అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సుకు రామకృష్ణ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. కళాశాలలోని ఎంపిక చేసిన 50 మంది విద్యార్థులకు ఒకరోజు ట్రైనింగ్ ప్రోగ్రాం లో భాగంగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గ్రీన్ వ్యాలీ ఫౌండేషన్ అధ్యక్షులు శ్రీమతి ఉమారాజ్ మాట్లాడుతూ యువతలో డ్రగ్స్ వినియోగం లిక్కర్ వినియోగం వంటివి ఎక్కువయ్యాని యువత బంగారు భవిష్యత్తుకు ఆటంకం కలిగించే ఇలాంటి వ్యసనాలు పట్ల విద్యార్థులు అవగాహన కలిగి జాగ్రత్తగా ఉండాలని క్షణికమైన ఉద్రేకములో మాదకద్రవ్యాల జోలికి వెళ్లకూడదని లిక్కర్ తీసుకోవడం ఫ్యాషన్ కాదని పార్టీ కల్చర్ బర్త్డే ఫంక్షన్ లు అని యువత మద్యపానం సేవించి డ్రైవింగ్ చేస్తున్నారని దీనివల్ల అనేక రోడ్డు ప్రమాదాలు జరిగి విద్యార్థులు మరణిస్తున్నారని అన్నారు. భారతదేశం నుండి అలాగే మన ఆంధ్ర దేశం నుండి గంజాయి వంటి మత్తు పదార్థాలను దేశం నుండి సమూలంగా తరిమివేసినప్పుడే దేశాభివృద్ధి జరుగుతుందని దీనికి విద్యార్థుల సహకారం అవసరమని అన్నారు. విద్యార్థులు తెలిసి కూడా వాటి జోలికి వెళ్తున్నారు ఒక్కసారి గంజాయి హెరాయిన్ బ్రౌన్ షుగర్ మత్తు ఇంజక్షన్ జోలికి వెళ్తే మళ్లీ వాటిని వదిలించుకోవడం చాలా కష్టం మీపైన తల్లిదండ్రులు ఎంతో నమ్మకం పెట్టుకుని కాలేజీలకు పంపిస్తూ ఉన్నారు బాగా చదువుకుని మీ కుటుంబానికి మంచి పేరు తీసుకుని రావడానికి మీరు ప్రయత్నం చేయాలి దానికి సత్ప్రవర్తన క్రమశిక్షణ చాలా అవసరం. అన్నింటికంటే ముఖ్యము వీటి పైన అవగాహన కలిగి ఉండాలి. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ కేవీవి సుబ్బయ్య మాట్లాడుతూ విద్యార్థులు కళాశాలలో చదువుకునే సమయంలోనే సరదాగా స్నేహితులతో కలిసి ధూమపానము వంటివి అలవర్చుకుంటారని ఇవి అనారోగ్యాన్ని కలిగించే విషయాలని క్యాన్సర్ వంటి వ్యాధులను కూడా కలిగిస్తాయని కాబట్టి ధూమపానము పాన్ పరాగలు గంజాయి డ్రగ్స్ వంటి జోలికి వెళ్లకుండా చాలా జాగ్రత్తగా ఉండాలని. వీటి వలన ఇల్లు ఒళ్ళు గుళ్ళ అవుతాయని అన్నారు. శారీరక మానసిక ఇబ్బందులను ఎన్నో ఎదుర్కొంటారు. సమాజంలో గౌరవాన్ని కోల్పోతారు. అపరిశుభ్రమైన అనారోగ్యకరమైన అలవాట్లను వదిలేసి క్రమశిక్షణతో వృద్ధిలోకి రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు అనేక విషయాలను వివరించారు. ఈ కార్యక్రమం ఎన్జీవోస్ సంస్థ అయిన సబ్ స్టెయిన్ అబ్యూజ్ ప్రివెన్షన్ మరియు లైఫ్ స్కిల్స్ వారి ఆధ్వర్యంలో జరిగింది. వెల్ఫేర్ ఆఫ్ డిఫరెంట్లీ ఎబిలిటీ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీమతి రైస్ ఫాతిమా మాట్లాడుతూ మా సంస్థ ఆధ్వర్యంలో వివిధ కళాశాలలోని విద్యార్థులకు అవగాహన సదస్సులు ట్రైనింగ్ కార్యక్రమాలు చేపడుతున్నామని అలాగే ఈరోజు కర్నూలు నుంచి వచ్చామని రామకృష్ణ డిగ్రీ కళాశాల లోని దాదాపు 50 మంది విద్యార్థులను ఎంపిక చేసుకుని ఒకరోజు ట్రైనింగ్ క్లాస్ గా ఇక్కడ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని. దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, డ్రగ్స్ పైన అవగాహన కలిగి డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో మీరందరూ భాగస్వాములు కావాలని ఇలాంటి కార్యక్రమాలు వల్ల మంచి చైతన్యం కలిగి క్రమశిక్షణతో నడుచుకోవాలని విద్యార్థి దశను చక్కగా చదువుకుంటూ ఉన్నతమైన పౌరులుగా ఎదగడానికి పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు అడిగి న అనేక సందేహాలకు నిర్వాహకులు సమాధానాలు చెప్పారు.
కార్యక్రమంలో వెల్ఫేర్ ఆఫ్ డిఫరెంట్లీ అబిలిటీ సూపర్డెంట్ సాల్మన్ రాజ్ వారి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. నంద్యాల రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ శ్రీ దస్తగిరి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.
జాతీయగీతం తో కార్యక్రమం ముగిసింది.




## పసుపు పంటపై రైతులకు

# అవగాహన సదస్సు.



ఆంధ్ర ప్రగతి మహానంది మార్చి 12: మహానంది మండలంలోని తిమ్మాపురం గ్రామంలో పసుపు పంటపై అవగాహన సదస్సును నిర్వహించారు. స్పైసిస్ బోర్డు అధికారి ఆనంద్ దూబే ఆధ్వర్యంలో అరటి రైతుల సహకారాలతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. పసుపులో నూతన వంగడాలైన బి ఎస్ ఆర్ 2, సుగంధం రకాలను సాగు చేయాలని రైతులకు సూచించారు. సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలని, రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలని రైతులకు సూచించారు. విచ్చలవిడిగా రసాయనిక రెవులు వాడడం, క్రిమిసంహారక మందులు పిచికారి చేయడం వలన పర్యావరణ సమతుల్యం దెబ్బ తినడమే కాక భూసారం తగ్గిపోతుందని రైతులకు తెలియజేశారు. ప్రభుత్వం పసుపు పంట నూర్పిడులకు సంబంధించి పసుపు ఉడికించడం, మరియు శుద్ధీకరణ యంత్రాలను ప్రభుత్వం సబ్సిడీ రూపంలో అందజేస్తుంది అన్నారు. పసుపు అమ్ముకోవడానికి మార్కెట్ సౌకర్యం కూడా కల్పించనున్నట్లు తెలిపారు. రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను పాటించడం వల్ల లాభాలను పొందవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి నాగరాజు మండల ఉద్యానవన శాఖ అధికారి శ్రీధర్ ఉద్యానవద శాఖ ఫీల్డ్ ఆఫీసర్ గురు ప్రసాద్ స్థానిక ఉద్యానవన అధికారులు రాజేశ్వరి, మౌనిక ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## అన్నమయ్య జిల్లాలో ప్రైవేటు బస్సులు ఢీ..

### - ఐదుగురు మృతి, 40 మందికి గాయాలు



**అన్నమయ్య జిల్లా,**
**మార్చి 12, ఆంధ్ర ప్రగతి:**
అన్నమయ్య జిల్లా మదనపల్లి సమీపంలో రాయల్పాడు దగ్గర ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఏపీ-కర్ణాటక సరిహద్దుల్లో రెండు ప్రైవేటు ట్రావెల్ బస్సులు ఢీకొన్నాయి. ఇద్దరు మృతిచెందారు. ఈ ప్రమా దంలో 40 మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులను కోలార్, శ్రీనివాస పురం, మదనపల్లి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించారు.

## రెండ్రోజుల్లో బెయిల్ రాకపోతే ఆత్మహత్యే శరణ్యం:పోసాని

**అమరావతి,మార్చి 12, ఆంధ్ర ప్రగతి** :సినీ నటుడు పోసాని కృష్ణమురళిని చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యల కేసులో పోలీసులు కర్నూలు నుంచి గుంటూరుకు తీసుకువచ్చారు. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. కాగా, జడ్జి ఎదుట పోసాని కన్నీటిపర్యంతమయ్యారు. తనపై వ్యక్తిగత కోపంతో ఫిర్యాదు చేశారని వాపోయారు. తన ఆరోగ్యం బాగా లేదని, ఇప్పటికి రెండు శస్త్రచికిత్సలు జరిగాయని, స్టెంట్లు వేశారని తెలిపారు. 70 ఏళ్ల వయసులో నన్ను ఇబ్బందిపెడుతున్నారు. తప్పు చేస్తే నన్ను నరికేయండి రెండ్రోజుల్లో బెయిల్ రాకపోతే ఆత్మహత్యే శరణ్యం! అని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికే పోసానికి పలు కేసుల్లో బెయిల్ వచ్చినప్పటికీ, సీఐడీ పోలీసులు పీటీ వారెంట్ పై అదుపులోకి తీసుకోవడంతో విడుదల సాధ్యపడలేదు.

# రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన జగన్

**మెడికల్ కాలేజీలు మంజూరు**
**చేసిన పూర్తి చేయలే**
**కేంద్రం రుణం, గ్రాంట్ల రూపంలో 4900 కోట్లు మంజూరు**
**జగన్ చేతకానితనం రుజువయ్యిందన్న మంత్రి సత్యకుమార్**



**అమరావతి,మార్చి 12, ఆంధ్ర ప్రగతి :** రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన అప్పుల రెడ్డి వైఎస్ జగన్.. రాష్ట్ర వైద్య విద్యను కూడా భ్రష్టు పట్టించారంటూ మంత్రి సత్యకుమార్ యాదవ్ మండిపడ్డారు. జగన్ ఇప్పుడు మొసలి కన్నీరు కార్చడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మోదీ ప్రభుత్వం ఏపీకి 17 మెడికల్ కాలేజీలను మంజూరు చేసి, గ్రాంట్లు, రుణ రూపంలో రూ. 4900 కోట్లిచ్చిందన్నారు. చేతకాని నాటి సీఎం జగన్ పులివెందులతో సహా, ఒక్క కాలేజీకి కూడా కావలసిన వసతులు పూర్తి చెయ్యలేదన్నారు. ఈ మేరకుమాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ విమర్శలు గుప్పించారు. జగన్‌ను అప్పుల రెడ్డి అని సంభోదిస్తూ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా నిప్పులు చెరిగారు ఏపీ మంత్రి. ఖర్చు పెట్టాల్సిన మొత్తం రూ. 8,480 కోట్లలో కేవలం 15? మాత్రమే నాలుగేళ్లలో ఖర్చు చేశారని తెలిపారు. మిగిలిన నిధుల్ని జగన్ దారి మళ్లించారని ఆరోపించారు. దాని కారణంగా రాష్ట్రం 2500 మెడికల్ సీట్లు మూల్యంగా చెల్లించాల్సి వచ్చిందన్నారు. ఃూష్ట్రంలో పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయాలనే జగన్ కుట్ర అర్థమవుతోందన్నారు. 5 మెడికల్ కాలేజీలలో అరకొర మౌలిక వసతులతో, కేవలం పేరు కోసం ఆర్భాటంగా తరగతులు ప్రారంభించారని విమర్శించారు. చదువు చెప్పడానికి అధ్యాపకులు లేరు.. సేవలందించడానికి నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది లేరన్నారు. బాలికలు ఉండడానికి వసతి భవనాల్లేవన్నారు. పులివెందుల కళాశాలకు ప్రజాధనం రూ.300 కోట్లు ఖర్చు పెట్టిన జగన్, మదనపల్లిలో రూ.500 కోట్లకు గాను రూ.30 కోట్లు కుడా ఖర్చు పెట్టలేదన్నారు. నర్సీపట్నంకు కేవలం 2 శాతం నిధులు, పాలకొల్లు కాలేజీకి సున్నా నిధులు ఖర్చు పెట్టారని మండిపడ్డారు. అన్ని మెడికల్ కాలేజీల పరిస్థితి ఇదే అని తెలిపారు. గిరిజన ప్రాంతంలో పార్వతీపురం కాలేజీ పట్ల చిత్తశుద్ధి లేని గత ప్రభుత్వం టెండర్లు కూడా పిలువలేదన్నారు. నిధులు ఖర్చు పెట్టకుండా, భవనాలు నిర్మించకుండా, బోధనా సిబ్బందికి నోటిఫికేషన్ ఇవ్వకుండా మెడికల్ కాలేజీలెలా ప్రారంభించాలని ప్రశ్నించారు. ఎలా నాణ్యమైన వైద్యవిద్యను బోధించాలని నిలదీశారు. నాలుగేళ్లలో గుర్రం నాడా మాత్రం తెచ్చి, ఏడాదిలో గుర్రం ఎందుకు తేలేదని మమ్మల్ని ప్రశ్నిస్తున్నారంటూ ఎద్దేవా చేశారు. మాజీ సీఎం చేతకానితనం ఇవాళ వైద్యవిద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులకు శాపంలా మారిందన్నారు. మరీ ముఖ్యంగా జీవో 108 తెచ్చి పేదలకు ప్రభుత్వ కళాశాలల్లో రూ.15,000 లకు అందాల్సిన వైద్యవిద్యను రూ. 25 లక్షల దాకా పెంచిన పేదల వ్యతిరేకి పెత్తందారు జగన్ అని దుయ్యబట్టారు. మెడికల్ కాలేజీ పురోగతి చూసినా ఏమున్నది గర్వకారణం, సమస్త కాలేజీలు పునాదులకే పరిమితమని.. ఇదీ నాలుగేళ్ల వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ నిర్వాకమంటూ విరుచుకుపడ్డారు. మదనపల్లి, ఆదోని, అమలాపురం, బాపట్ల, పెనుకొండ, పాలకొల్లు వైద్య కళాశాలల పురోగతి చూస్తే వాస్తవాలు ప్రజలకు తెలుస్తాయన్నారు. వీటిలో వైద్యవిద్యను ఎలా చెప్పాలో జగన్‌మోహన్ రెడ్డే చెప్పాలని మంత్రి సత్యకుమార్ వ్యాఖ్యలు చేశారు.

# భవన నిర్మాణానికి 24 గంటల్లో అనుమతులు

**- ప్రాంతీయ పట్టణ ప్రణాళిక జోనల్ డిప్యూటీ డైరెక్టర్ విజయ భాస్కర్**
**- నూతన మార్గదర్శకాలపై సిబ్బందికి అవగాహన సదస్సు**
**- హాజరైన ఉమ్మడి జిల్లా పట్టణ ప్రణాళిక అధికారులు, కార్యదర్శులు**






**కర్నూలు మార్చి ఆంధ్ర ప్రగతి**
రాష్ట్ర వ్యాప్తంగా పట్టణాల్లో భవన నిర్మాణ అనుమతుల కోసం రోజుల తరబడి వేచి చూడాల్సిన అవసరం ఇక ఉండదని, ధరకాస్తు చేసుకున్న 24 గంటల్లో అనుమతులు పొంది నిర్మాణాలు ప్రారంభించుకోవచ్చని పట్టణ ప్రణాళిక శాఖ అనంతపురం ప్రాంతీయ డిప్యూటీ డైరెక్టర్ బి.విజయ భాస్కర్ స్పష్టం చేశారు. బుధవారం స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో, ఉమ్మడి కర్నూలు జిల్లాలోని మున్సిపాలిటీల పట్టణ ప్రణాళిక విభాగ అధికారులు, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు, లైసెన్స్ ఇంజనీర్లులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ మాట్లాడుతూ.. భవన నిర్మాణాలకు అనుమతుల్లో జాప్యాన్ని నిరోధిస్తూ ప్రభుత్వం కొత్తగా పథకం అమలుకు శ్రీకారం చుట్టిందని, తద్వారా దరఖాస్తు పోర్టల్లో అప్లోడ్ చేసిన గంటల వ్యవధిలోనే అనుమతులు పొంది పనులు ప్రారంభించుకోవచ్చని, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ సైతం పొందవచ్చన్నారు. 18 మీటర్ల కంటే తక్కువ ఎత్తులో గ్రౌండుతో పాటు మరో నాలుగు అంతస్తుల భవన నిర్మాణాలకు వాటి యజమానుల స్వీయ ధ్రువీకరణతో కార్పొరేషన్, మున్సిపాలిటీ, నగర పంచాయతీల నుంచి ఆన్లైన్లో అనుమతులు తీసుకొవచ్చని పేర్కొన్నారు. ఇందుకోసం సమీపంలోని లైసెన్స్డ్ టెక్నికల్ పర్సన్ ద్వారా దరఖాస్తులు, అనుబంధ పత్రాలతోపాటు వాటిని ధ్రువీకరిస్తున్నట్లుగా అంగీకార పత్రాన్ని ఆన్లైన్ భవన నిర్మాణ అనుమతి వ్యవస్థ పోర్టల్లో అప్లోడ్ చేయాలని, అర్జీతోపాటు అనుబంధ పత్రాలను పోర్టల్ ద్వారా పరిశీలించి అనుమతులిచ్చేలా ప్రత్యేక సాఫ్ట్వేర్ను ప్రభుత్వం రూపొందించినట్లు వెల్లడించారు. నిర్మాణం పూర్తయ్యాక, మళ్లీ ఆన్లైన్ పోర్టల్లోనే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చనని తెలిపారు. భవన నిర్మాణాలకు ఆన్లైన్లో అనుమతులు తీసుకున్నాక పనుల నిర్వహణపై పట్టణ ప్రణాళిక అధికారులు ఇప్పటివరకు చేపట్టిన పోస్ట్ వెరిఫికేషన్ పద్ధతిలో సైతం ప్రభుత్వం చట్టసరవణ చేసిందన్నారు. సర్వే రిపోర్ట్, స్థలం విలువ ఆధారిత సర్టిఫికెట్ తదితరాలు తప్పనిసరని, దీనికి విరుద్ధంగా ఎవరైనా వ్యవహరించినట్లు ఆకస్మిక తనిఖీల్లో వెల్లడైతే అనుమతులు రద్దు చేస్తామని స్పష్టం చేశారు. టెక్నికల్ పర్సన్ల పరంగా తప్పులు చేసినట్లు నిర్ధారణైతే అలాంటి వారి లైసెన్సులు ఐదేళ్ల పాటు రద్దు అవుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, డిప్యూటీ సిటీ ప్లానర్ శోభన్ బాబు, జిల్లా డీటీసీపీఓ శశిలత, నంద్యాల అసిస్టెంట్ సిటీ ప్లానర్ మూర్తి, ఆర్డీడీటీపీ టిపిఏ ఓంకార్, కూడా ఈఈ సురేష్ కుమార్, వివిధ మున్సిపాలిటీల టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది, వార్డ్ ప్లానింగ్, రెగ్యులేషన్ కార్యదర్శులు ఎల్.టి.పిలు పాల్గొన్నారు.

# కొడాలి నానికి ఊరట

### -35(3) కింద నోటీసులివ్వాలని హైకోర్టు ఆదేశం




**గుడివాడ మార్చి 12, ఆంధ్ర ప్రగతి**
:మాజీ మంత్రి కొడాలి నానికి ఏపీ హైకోర్టులో ఊరట లభించింది. ఆయనపై తొందరపాటు చర్యలు తీసుకోవద్దని, 35(3) సెక్షన్ కింద నోటీసులిచ్చి వివరాలు తీసుకోవాలని పోలీసులను ధర్మాసనం ఆదేశించింది. విశాఖలో తనపై నమోదైన కేసును క్వాష్ చేయాలని ఏపీ హైకోర్టులో కొడాలి నాని పిటీషన్ వేయడం జరిగింది. దీంతో న్యాయమూర్తి కీలక ఆదేశాలు జారీ చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మంత్రిగా పనిచేసిన కొడాలి నాని అప్పటి ప్రతిపక్ష నేత, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ లపై బూతులతో విరుచుకుపడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కొడాలి నానిపై గత ఏడాది నవంబర్ 24న విశాఖ 3టౌన్ పోలీస్ స్టేషన్లో ఏయూ కళాశాల విద్యార్థిని ఫిర్యాదు చేశారు. చంద్రబాబు, లోకేష్ పై కొడాలి నాని తిట్టిన బూతులను విని భరించలేకపోయామని, ఆయనపై చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో కోరడం జరిగింది. దీంతో కొడాలి నానిపై అప్పట్లో కేసు నమోదైంది. రాష్ట్రంలో వరుసగా వైసీపీ నేతలపై కేసులు, అరెస్టులు జరుగుతున్న పరిస్థితుల్లో కొడాలి నానిని కూడా అరెస్ట్ చేస్తారనే ప్రచారం కూడా ఉంది. ఇటీవల గుడివాడలో కొడాలి నాని అనుచరులకు పోలీసులు 41ఎ నోటీసులను కూడా జారీ చేశారు. దీంతో అప్రమత్తమైన కొడాలి నాని ముందస్తుగా హైకోర్టును ఆశ్రయించడం జరిగింది.



# రాహుల్‌కు ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్సీ ఆఫర్

**• నో చెప్పిన కేఎల్ రాహుల్**

ఛాంపియన్స్ ట్రోఫీ నుంచి తిరిగి వచ్చిన తర్వాత కెఎల్ రాహుల్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. కెప్టెన్సీకి నో చెప్పాడు. కెఎల్ రాహుల్ తీసుకున్న ఈ నిర్ణయం ఐపీఎల్ కెప్టెన్సీకి సంబంధించినది. ఐపీఎల్ 2025లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు కెప్టెన్ ఆఫర్‌ను రాహుల్ తిరస్కరించాడు. ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంచైజీ రాహుల్‌కు కెప్టెన్సీని ఆఫర్ చేసిందని, దానిని అతను అంగీకరించలేదని నివేదిక పేర్కొంది. కెఎల్ రాహుల్ కెప్టెన్సీ ఆఫర్‌ను తిరస్కరించాడు. ఆటగాడిగా జట్టుకు మరింత సహకారం అందించాలనుకుంటున్నానని చెప్పాడు. కెఎల్ రాహుల్ జట్టు కెప్టెన్సీకి నిరాకరించిన తర్వాత, ఇప్పుడు అక్షర్ పటేల్ ఢిల్లీ ఫ్రాంచైజీకి నాయకత్వం వహించవచ్చని వార్తలు వస్తున్నాయి. ఎందుకంటే కెప్టెన్సీ ఈ రెండు పేర్ల మధ్యే జరిగింది. ఐపీఎల్ 2025 మెగా వేలంలో ఢిల్లీ క్యాపిటల్స్ రూ.14 కోట్లకు బిడ్డింగ్ చేసి కేఎల్ రాహుల్‌ను కొనుగోలు చేసింది. రాహుల్‌కు గతంలో ఐపీఎల్‌లో కెప్టెన్‌గా పనిచేసిన అనుభవం ఉంది. 2020-21లో పంజాబ్ కింగ్స్‌కు కెప్టెన్‌గా, 2022 నుండి 2024 వరకు లక్నో సూపర్ జెయింట్స్‌కు కెప్టెన్‌గా ఉన్నాడు. అతను ఢిల్లీలో చేరినప్పుడు కెప్టెన్సీ రేసులో అతడి పేరు ముందంజలో ఉంది. ఇప్పుడు రాహుల్ ఆటగాడిగా మాత్రమే ఆడాలనుకుంటున్నట్లు మీడియా నివేదికలు పేర్కొన్నాయి. రాహుల్ తీసుకున్న ఈ నిర్ణయం ఢిల్లీకి కూడా పని చేస్తుంది. ఐపీఎల్‌లో అత్యంత స్థిరంగా రాణిస్తున్న ఆటగాళ్లలో రాహుల్ ఒకరు. 2018 నుండి 2024 వరకు ఆడిన 7 ఐపీఎల్ సీజన్లలో 6 లో తను 500 లేదా అంతకంటే ఎక్కువ పరుగులు చేశాడు. రాహుల్ కెప్టెన్ కాకపోతే అక్షర్ కెప్టెన్ కావడం ఖాయం. కానీ సమస్య ఏమిటంటే రాహుల్ లాగా అతనికి ఐపీఎల్‌లో కెప్టెన్సీ అనుభవం పెద్దగా లేదు. ఆటగాడిగా అతను బ్యాటింగ్, బౌలింగ్ రెండింటితోనూ చాలాసార్లు తనను తాను నిరూపించుకున్నారు. కానీ అతను ఇంకా కెప్టెన్‌గా తనను తాను నిరూపించుకోవాల్సి ఉంది. బహుశా ఢిల్లీ క్యాపిటల్స్ అతనికి ఆ అవకాశం ఇస్తుందేమో చూడాలి.

# ఓపెనర్‌గా ఆడే ఛాన్స్ ఇవ్వండి

**• స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ కీలక వ్యాఖ్యలు**

గత కొన్ని రోజులుగా వార్తల్లో నిలుస్తోన్న టీమ్ఇండియా సీనియర్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ మరోసారి తన కామెంట్స్?తో నెట్టింట వైరలయ్యాడు. ఐపీఎల్ 2025 సీజన్ కోసం పంజాబ్ కింగ్స్ తరఫున బరిలోకి దిగుతున్న ఈ స్టార్, రీసెంట్?గా తన టీమ్?తో కలిసి ప్రాక్టీస్‌ను మొదలుపెట్టాడు. అంతకుముందు ఐపీఎల్‌లో రూ.18 కోట్లు వెచ్చించి చాహల్‌ను పంజాబ్ దక్కించుకుంది. అయితే, ఇప్పుడీ కొత్త సీజన్‌లో నయా అవతార్?లో మెరిసేందుకు సిద్ధమంటూ చాహల్ ఓ వీడియోలో సందడి చేశాడు. ప్రస్తుతం ఆ గ్లింప్స్ క్రీడాభిమానుల దృష్టిని ఆకర్షిస్తోంది. పంజాబ్ టీమ్? హెడ్? కోచ్? రికీ పాంటింగ్‌కు చాహల్ ఓ ఆఫర్ ఇచ్చాడు. ఒకవేళ టీమ్?కు ఓపెనర్ అవసరం ఉంటే తనను పరిగణనలోకి తీసుకోవాలంటూ ఓ వీడియో మెసేజ్ పంపాడు.'రికీ ఓపెనింగ్ స్లాట్ ఏమైనా ఖాళీగా ఉందా?' అంటూ ఫన్నీ కామెంట్స్ కూడా చేశాడు. అయితే ప్రాక్టీస్ చేసేందుకు వెళ్తున్న సమయంలో రికీని బ్యాటింగ్ ఆర్డర్ గురించి అడగటం కూడా ఆ వీడియోలో ఉంది. దానికి తగ్గట్లుగా రికీ కూడా తన బ్యాటింగ్? స్కిల్స్?ను చూపిస్తూ సందడి చేశాడు. తన ఫన్నీ సైడ్?తో టీమ్? మెంబర్స్?ను నవ్వించాడు.ఇదిలా ఉండగా, చెందిన ముగ్గురు టాప్ ప్లేయర్లను ఎలాగైనా పంజాబ్ టీమ్?లోకి తీసుకోవాలని అనుకున్నట్లు గతంలో రికీ పాంటింగ్ వెల్లడించాడు. అందులో చాహల్ కూడా ఉన్నట్లు ఆయన వెల్లడించాడు. మెగా ఆక్షన్?లో నేను టీమ్ఇండియాకు చెందిన ముగ్గురు ప్లేయర్లను దక్కించుకోవాలని బలంగా అనుకుంటున్నాను. అందులో నాలుగేళ్లుగా టీమ్?తో ఉంటోన్న అర్షదీప్ సింగ్‌ను కూడా తీసుకోవాలని భావించాను. అయితే ఓ కెప్టెన్‌గా గతంలోనే నేను పనిచేసిన శ్రేయస్ అయ్యర్ కోసం చివరి వరకూ ప్రయత్నించి దక్కించుకున్నాం. ఇక నా లిస్ట్?లో ఉన్న మూడో ప్లేయర్? చాహల్. తప్పకుండా ఈ ముగ్గురితో జట్టు బ్యాలెన్స్?డ్?గా ఉంటుందని అనుకుంటున్నా'' అని రికీ తెలిపాడు.పంజాబ్ కింగ్స్ తుది జట్టు :శ్రేయాస్ అయ్యర్ (కెప్టెన్), విష్ణు వినోద్, జాస్ ఇన్‌గ్లిస్, గ్లెన్ మ్యాక్స్‌వెల్, హరనూర్ పన్ను, పాయల్ అవినాష్, ప్రభుసిమ్రాన్ సింగ్, శశాంక్ సింగ్, మార్కస్ స్టాయినీస్, నేహాల్ వధేరా, మార్కో యాన్సన్, హర్‌ప్రీత్ బ్రార్, ప్రియాన్ష్ ఆర్య, అజ్మతుల్లా ఓమర్జాయ్, యశ్ ఠాకూర్, ముషీర్ ఖాన్, ఆరోన్ హార్డీ, జేవియర్, సూర్యాన్ష్ షెడ్జే, అర్షదీప్ సింగ్, యుజ్వేంద్ర చాహల్, వ్యాషక్ విజయ కుమార్, లోకీ ఫెర్గ్యూసన్, కల్దీప్ సెన్, ప్రవీణ్ దుబే.



# ఆడవారిని నిందించడం ఫ్యాషన్ అయింది

**• ధనశ్రీ వర్మ ఆసక్తికర పోస్ట్**

టీమ్ ఇండియా క్రికెటర్ యుజ్వేంద్ర చాహల్, ధనశ్రీ వర్మ విడిపోతున్నారంటూ కొంతకాలంగా ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. దీంతో తరచూ వీరు వార్తల్లో నిలుస్తున్నారు. ఇటీవల వీరికి విడాకులు మంజూరైనట్టు వార్తలు వచ్చాయి. కానీ అవి నిజం కాదని.. విడాకుల వ్యవహారం ఇంకా కోర్టు పరిధిలోనే ఉందని ధనశ్రీ వర్మ లాయర్ వివరణ ఇవ్వడంతో ఆ వార్తలకు బ్రేక్ పడింది. ఇక ఆదివారం జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌ను చాహల్ ఓ అమ్మాయితో కలిసి వీక్షించడం ప్రస్తుతం చర్చనీయాంశమవుతోంది. ఒకవైపు దేశమంతా టీమిండియా ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచిన సంబరాల్లో ఉంటే.. మరోవైపు క్రికెటర్ యుజ్వేంద్ర చాహల్ గురించి కూడా అంతే చర్చ నడుస్తోంది. దీనికి కారణం చాహల్ సోషల్ మీడియా స్టార్, రేడియో జాకీ మహవష్‌తో జంటగా కనిపించాడు. దీంతో చాహల్-వర్మ విడిపోవడానికి ఈ అమ్మాయే కారణం అని రూమర్లు మొదలయ్యాయి. స్టేడియంలో ఇద్దరూ ఉన్న ఫొటోలు, వీడియోలు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. ఈ క్రమంలో ధనశ్రీ వర్మ ఆసక్తికర పోస్ట్ పెట్టారు. మహిళలను నిందించడం ఎప్పుడూ ఫ్యాషనే అంటూ రాసుకొచ్చారు. ఈ పోస్టుకు నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు. విడాకుల వార్తల విషయంలో తనపై వస్తున్న ట్రోల్స్‌కు ఆమె ఇలా స్పందించారంటూ కామెంట్స్ చేస్తున్నారు. దీంతో ప్రస్తుతం ధనశ్రీ చేసిన పోస్ట్ వైరల్‌గా మారింది. చాహల్, ధనశ్రీ 2020లో వివాహం చేసుకున్నారు. కొరియోగ్రాఫర్‌గా, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌గా తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నారు ధనశ్రీ.. పెళ్లి తర్వాత వీళ్లిద్దరూ ఇన్‌స్టాలో రీల్స్ చేస్తూ ఫ్యాన్స్‌ను అలరించేవారు. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే ఈ జంట.. గతంలో పెట్టిన పోస్టులు అభిమానులను గందరగోళానికి గురిచేశాయి. సోషల్ మీడియాలో వీరిద్దరూ ఒకరిని ఒకరు అన్‌ఫాలో చేసుకోవడం. ధనశ్రీ తన పేరు నుంచి చాహల్ పేరును తీసేయడంతో వీరు విడాకులు తీసుకోబోతున్నారంటూ రూమర్స్ వ్యాపించాయి. అంతేకాదు ధనశ్రీ, చాహల్ జంట ఇటీవల కోర్టుకు హాజరైనట్టు కథనాలు వచ్చాయి. వీరిద్దరికి 45 నిమిషాలు పాటు కౌన్సిలింగ్ ఇచ్చిన జడ్జి విడిపోవడానికి గల కారణాలు తెలుసుకున్నారని.. పరస్పర అంగీకారంతో జడ్జి విడాకులకు ఆమోదం తెలిపినట్టు తెలిసింది. ధనశ్రీ భరణంగా రూ.60 కోట్లు డిమాండ్ చేసినట్టు వార్తలు వినిపించాయి. ఈ వార్తలపై స్పందించిన ధనశ్రీ లాయర్.. న్యాయపరమైన ప్రక్రియపై అప్పుడే మాట్లాడడం సరికాదని.. ప్రస్తుతం ఈ వ్యవహారం కోర్టు పరిధిలో ఉందన్నారు. కథనాలు రాసేముందు వాస్తవాలు తెలుసుకోవాలని.. తప్పుడు సమాచారం వ్యాప్తి చేయకూడదని అన్నారు.





# ఐపీఎల్ ముగిసిన తరువాత టీమ్ ఇండియా బిజీ

**• దాదాపు నెలన్నర రోజులు ఇంగ్లండ్‌లో బిజీ**

**• ఇంగ్లండ్ లో టీమ్ ఇండియా పర్యటన ఖరారు**

**• జూన్ 20 నుంచి 5 టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ మొదలు**

ఐపీఎల్ 2025 మే 25న ముగిసిన తరువాత జూన్ నెల మూడో వారం నుంచి టీమ్ ఇండియా బిజీ కానుంది. టీమ్ ఇండియా ఇంగ్లండ్ పర్యటన ఖరారైంది. ఇండియా - ఇంగ్లండ్ జట్ల మధ్య 5 టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ జూన్ 20 నుంచి ఆగస్టు 4 వరకు జరుగుతుంది. అంటే దాదాపు నెలన్నర రోజులు ఇంగ్లండ్‌లో బిజీగా గడపనుంది. మొదటి టెస్ట్ మ్యాచ్ జూన్ 20 నుంచి 24 వరకు హెడింగ్లీలో జరగనుంది. రెండవ టెస్ట్ మ్యాచ్ జూలై 2 నుంచి 6 వరు బర్మింగ్ హామ్‌లోని ఎడ్జ్ బాస్టన్‌లో, మూడవ టెస్ట్ జూలై 10 నుంచి 14 వరకు లండన్ లార్డ్స్ మైదానంలో జరగనున్నాయి. ఇక నాలుగవ టెస్ట్ జూలై 23 నుంచి 27 వరకు మాంచెస్టర్‌లో, చివరి టెస్ట్ మ్యాచ్ జూలై 31 నుంచి ఆగస్టు 4 వరకు లండన్ కెన్నింగ్టన్ ఓవల్‌లో జరగనుంది. ఇక ఆ తరువాత అంటే ఆగస్టు నుంచి డిసెంబర్ వరకు పూర్తిగా విశ్రాంతిలో ఉంటుంది. ఎలాంటి, ఏ విధమైన సిరీస్ ఉండదు. కాగా ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో లీగ్ దశ నుంచి నాకౌట్ వరకూ ఒక్క ఓటమి లేకుండా గెలుస్తూ చివరికి ట్రోఫీ సాధించింది టీమ్ ఇండియా. ప్రపంచవ్యాప్తంగా రోహిత్ సేనపై ప్రశంసలు కురుస్తున్నాయి. అటు బ్యాటర్లు, ఇటు బౌలర్లు ఫుల్ ఫామ్‌లో ఉండటంతో భారత జట్టుపై అంచనాలు భారీగా పెరిగిపోయాయి.దుబాయ్ పాకిస్తాన్ వేదికలపై 19 రోజుల పాటు జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ 2025 ముగిసింది. ఇండియా విజేతగా నిలిచింది. విజేతగా స్వదేశానికి తిరిగొచ్చిన ఆటగాళ్లకు వివిధ విమానాశ్రయాల్లో భారీగా స్వాగతం లభించింది. ఇప్పుడు టీమ్ ఇండియా నెక్స్ట్ టార్గెట్ ఏంటి, ఏ సిరీస్ ఆడనుంది, ఎప్పుడు ఉంటుందని అభిమానులు చర్చించుకుంటున్నారు. వాస్తవానికి వచ్చే 4 నెలల పాటు టీమ్ ఇండియా జట్టుగా ఎలాంటి సిరీస్ ఆడటం లేదు. పూర్తిగా విశ్రాంతి మోడ్‌లో ఉంటుంది. కానీ ఎవరికి వారు వ్యక్తిగతంగా మాత్రం మరో రెండు నెలలు పూర్తిగా బిజీ కానున్నారు. మరి కొద్ది రోజుల్లో ఐపీఎల్ 2025 సీజన్ 18 ప్రారంభం కానుంది. మార్చ్ 22 నుంచి మే 5 వరకు జరగనున్న ఐపీఎల్ 2025లో టీమ్ ఇండియాలోని దాదాపు అందరు ఆటగాళ్ల పది ఫ్రాంచైజీల్లో ఉన్నవాళ్లే. అంటే టీమ్ ఇండియా ఆటగాళ్లకు మార్చ్ 22 వరకే విశ్రాంతి తీసుకోడానికి అవకాశం ఉంది. ఆ తరువాత రెండు నెలలు హెక్టిక్ షెడ్యూల్. మే 25న కోల్‌కతాలో జరిగే ఫైనల్‌తో ఐపీఎల్ ముగియనుంది. ఐపీఎల్ మొదటి మ్యాచ్ గత సీజన్ విజేత కేకేఆర్ వర్సెస్ ఆర్సీబీ మధ్య మార్చ్ 22వ తేదీన బెంగళూరులో జరగనుంది.

# సన్ రైజర్స్ అభిమానులకు బిగ్ సర్ప్రైజ్

**- సన్ రైజర్స్ కొత్త జెర్సీ విడుదల**

ఐపీఎల్ జోష్ మరికొన్ని రోజుల్లోనే మొదలవబోతోంది. టోర్నీలోని ఫ్రాంచైజీల సందడి మాములుగా లేదు. హైదరాబ్దా కు చెందిన సన్ రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ తాజాగా అభిమానులకు బిగ్ సర్ప్రైజ్ ఇచ్చింది. ఈ సీజన్ కు గాను తమ జట్టు సభ్యులు ధరించే జెర్సీ ఫొటోలని తాజాగా విడుదల చేసింది. సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ ఇన్ స్టాగ్రామ్ వేదికగా ఇందుకు సంబంధించిన పోస్టును రిలీజ్ చేశారు. ఈ వీడియో క్షణాల్లో వైరలైంది. కుర్రాళ్లు అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ నూతన జెర్సీలను ధరించి, తగ్గేదేలే అన్నట్లుగా ఫోజు పెట్టారు. ఇక ఈ వీడియోపై కామెంట్లు చేస్తూ, లైకులు, షేర్లతో సోషల్ మీడియాను ఆరెంజ్ ఆర్మీ సభ్యులు షేక్ చేస్తున్నారు. దాదాపుగా గతేడాది ధరించిన జెర్సీలానే ఉంది. ఇక గతేడాది ధనాధన్ ఆటతీరుతో మైమరిపించిన సన్ రైజర్స్.. ఈ ఏడాది తన జట్టును మరింత పటిష్టం చేసుకుంది. కోర్ టీమ్ లోని చాలామంది ప్లేయర్లను రిటైన్ చేసుకున్న సన్.. ఈ ఏడాది ఇషాన్, మహ్మద్ షమీ, హర్షల్ పటేల్, ఆడమ్ జంపాలాంటి ప్లేయర్లను జట్టులోకి తీసుకుంది. దీంతో టీమ్ మరింత బలోపేతమైనట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు. గతేడాది ఫటాఫట్ ఆటతీరుతో ప్రత్యర్థి బౌలర్లను ముప్పుతిప్పలు పెట్టారు సన్ బ్యాటర్లు. ముఖ్యంగా ఆరంభంలోనే ఓపెనర్లు ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ.. ప్రతి బంతిని బౌండరీకి తరలించాలని ఆడుతూ, ముచ్చెటమలు పట్టించారు. హెన్రీచ్ క్లాసెన్, నితీశ్ రెడ్డి కూడా ధనాధన్ ఆటతీరుతో ఎంతో మంది బౌలర్లకు నిద్ర లేని రాత్రుళ్లను మిగిల్చాడు. ఈ ఏడాది ఇషాన్, అభినవ్ మనోహర్ లాంటి హిట్టర్లతో బలం మరింత పెరిగింది. ఇక బౌలింగ్ లో షమీ, హర్షల్, జంపా, కెప్టెన్ పాట్ కమిన్స్ రాకతో మరింత స్ట్రాంగ్ గా మారింది. ఈనెల 23ను హైదరాబాద్ లోని ఉప్పల్ మైదానం వేదికగా తమ తొలి మ్యాచ్ ను ఆడనుంది. మ.3.30 గంటలకు మాజీ ఛాంపియన్ రాజస్థాన్ రాయల్స్ తో తలపడనుంది. 2016 టైటిల్ గెలిచిన సన్.. 2018, 2024లో రన్నరప్ గా నిలిచింది. దీంతో ఈసారి మరో టైటిల్ నెగ్గాలని భావిస్తోంది.



## ఓటీటీలోకి ముఫాసా

# ది లయన్ కింగ్




హాలీవుడ్ బ్లాక్ బస్టర్ 'ముఫాసా: ది లయన్ కింగ్' ఓటీటీలోకి రాబోతుంది. తాజాగా ఈ సినిమా ఓటీటీ అప్‌డేట్‌ని ప్రకటించారు. 'ది లయన్ కింగ్' సినిమాకు ప్రీక్వెల్‌గా వచ్చిన ఈ చిత్రం డిసెంబర్ 20న ప్రేక్షకుల ముందుకు వచ్చి సూపర్ హిట్ అందుకోవడమే కాకుండా ఇండియాలోనే దాదాపు రూ.100 కోట్ల వసూళ్లను రాబట్టింది. ఇక తెలుగులో ముఫాసా అనే రాజు పాత్రకు మహేశ్ బాబు డబ్బింగ్ చెప్పగా.. బాలీవుడ్ హిందీ వెర్షన్‌కి షారుఖ్ ఖాన్ డబ్బింగ్ చెప్పాడు. ముఫాసా కొడుకు పాత్ర అయిన సింబా పాత్రకు షారుఖ్ కొడుకు ఆర్యన్ ఖాన్ డబ్బింగ్ చెప్పాడు.ఇదిలావుంటే తాజాగా ఈ చిత్రం ఓటీటీ లాక్ చేసుకుంది. ప్రముఖ ఓటీటీ వేదిక జియో హాట్‌స్టార్‌లో ఈ చిత్రం మార్చి 26 నుంచి తెలుగుతో పాటు ఇంగ్లీష్, హిందీ, తమిళం భాషల్లో స్ట్రీమింగ్ కాబోతున్నట్లు వెల్లడించింది.

# విజయ్ ఆంటోనీ 25వ చిత్రం 'భద్రకాళి'

హీరోగా, నిర్మాతగా, లిరిసిస్ట్ గా, దర్శకుడిగా, సంగీత దర్శకుడిగా, ఎడిటర్‌గా ఇలా అన్ని రకాలుగా సత్తా చాటుకున్నారు విజయ్ ఆంటోనీ. ఆయన ప్రస్తుతం తన కెరీర్‌లో ప్రతిష్ఠాత్మకమైన 25వ చిత్రం 'భద్రకాళి'తో ఆడియెన్స్ ముందుకు రాబోతోన్నారు. ఇప్పటికే రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. విజయ్ ఆంటోని ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్ పై మీరా విజయ్ ఆంటోని సమర్పణలో అరుణ్ ప్రభు ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు.




తాజాగా భద్రకాళి సినిమాకు సంబంధించిన టీజర్‌ను రిలీజ్ చేశారు. "పిల్లి కూడా ఒక రోజు పులి అవును... అబద్ధం, అహంకారం అంతం అవును"... అంటూ ప్రారంభమైన ఈ టీజర్ ను చూస్తే... ఈ సినిమాలో విజయ్ ఆంటోని అసలు ఏ పాత్రను పోషిస్తున్నాడన్నది సస్పెన్స్ కలిగిస్తుంది. ఒకసారి ఫ్యామిలీ మేన్‌లా, మరోసారి గ్యాంగ్ స్టర్‌లా అనిపిస్తున్నారు.. ఇంకో సందర్భంలో ఉన్నతాధికారిలా కనిపిస్తున్నారు... అసలు ఈ కిట్టు ఎవరు? అనే ఆసక్తిని రేకెత్తించేలా భద్రకాళి టీజర్‌ను కట్ చేశారు.

190 కోట్ల కుంభకోణం పాయింట్ చుట్టూ కథ తిరుగుతుందని అర్థమవుతోంది. ఇది కేవలం ఆరంభం మాత్రమే అంటూ చివర్లో వచ్చిన డైలాగ్‌తో టీజర్ మీద మరింత ఆసక్తిని పెంచేసినట్టు అయింది. విజయ్ ఆంటోని ఈ చిత్రంలో ఇది వరకు ఎన్నడూ కనిపించినంత స్టైలిష్‌గా, యాక్షన్ హీరోగా కనిపిస్తున్నారు. ఈ సినిమాకు విజయ్ ఆంటోని సంగీతాన్ని కూడా అందిస్తున్నారు.

సినిమాటోగ్రాఫర్ షెల్లీ కాలిస్ట్ విజువల్స్ ఈ టీజర్‌లో అద్భుతంగా అనిపిస్తున్నాయి. విజయ్ ఆంటోనీ ఆర్ఆర్, రేమండ్ డెరిక్ క్రాస్టా ఎడిటింగ్, రాజశేఖర్ కంపోజ్ చేసిన ఫైట్స్ ఈ టీజర్‌లో హైలెట్ అవుతున్నాయి.

ఈ సినిమాలో వాగై చంద్రశేఖర్, సునీల్ కృపలానీ, సెల్ మురుగన్, తృప్తి రవీంద్ర, మాస్టర్ కేశవ్ వంటి వారు ముఖ్య పాత్రల్ని పోషించారు. టీజర్‌తో సినిమాపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఈ భద్రకాళి సినిమాను సమ్మర్ కానుకగా విడుదల చేయాలని భావిస్తున్నారు.

# సాయిపల్లవి కోసం 'క్యూ' కడుతున్న కథలు!



సినిమా ప్రపంచం... ఇక్కడ అమ్మ పాత్రను పోషించేవారు కూడా అందంగానే కనిపించాలనే లెక్కలుంటాయి. అలాంటిది హీరోయిన్ గ్లామరస్ గా కనిపించాలని అనుకోకుండా ఎలా ఉంటారు? ఒకవేళ గ్లామరస్ గా కనిపించే ఆలోచన లేకపోతే ఇటువైపు రావడమే అనవసరం అనే మాటలు వినిపిస్తూనే ఉంటాయి. ఈ కారణంగానే నటనను మాత్రమే నమ్ముకుని రావడానికి చాలామంది హీరోయిన్స్ భయపడుతూ ఉంటారు.

కానీ గ్లామరస్ గానే కాదు... నటన పరంగా కూడా ఆకట్టుకోవచ్చని నిరూపించిన కథానాయికలు ఇక్కడ చాలా తక్కువమంది కనిపిస్తారు. అలాంటివారిలో సౌందర్య, స్నేహ, నిత్యామీనన్ వంటివారి పేర్లు కనిపిస్తాయి. ఆ జాబితాలో ఇప్పుడు వెలిగిపోతున్న పేరే సాయిపల్లవి. ఫ్యామిలీ ఆడియన్స్ ఆమెను ఇప్పుడు ఒక హీరోయిన్ గా చూడటం లేదు... తమ ఇంటి అమ్మాయిగా భావిస్తున్నారు. ఆమె సినిమాలకి కుటుంబ సమేతంగా వెళుతున్నారు.

నటన పరంగానే కాదు... డాన్స్ పరంగా కూడా సాయిపల్లవి నెక్స్ట్ లెవెల్లో కనిపిస్తుంది. మలయాళ, తమిళ, తెలుగు సినిమాల మీదుగా ఆమె ప్రయాణం బాలీవుడ్ వరకూ వెళ్లింది. సాయిపల్లవి ఉంటే ఆ ప్రాజెక్టు క్రేజ్, మార్కెట్ పెరగడానికి ఎక్కువ సమయం పట్టడం లేదు. ఇక అది లేడీ ఓరియెంటెడ్ కథ అయితే ప్రత్యేకించి చెప్పవలసిన పనేలేదు.

అందువల్లనే సాయిపల్లవి కోసం ఇప్పుడు చాలామంది మేకర్స్ వెయిట్ చేస్తున్నట్టు టాక్. సాయిపల్లవి చేసే సినిమాలలో సహజంగానే ఆమె పాత్రకి ప్రాధాన్యత ఉంటుంది. ఇక నాయిక ప్రధానమైన పాత్రలలో ఆమె మరింత జీవిస్తుంది. ఎంతటి బలమైన కథనైనా ఆడియన్స్ వరకూ తీసుకుని వెళ్లగలిగే సత్తా ఆమెకి ఉంది. అందువలన చాలామంది మేకర్స్ ఆమెను దృష్టిలో పెట్టుకుని కథలను తయారుచేసుకుంటున్నారు. ఆ కథలను ఆమెకు వినిపించడం కోసం గట్టిగానే ట్రై చేస్తున్నారట. ఒకేసారి ఇన్ని భాషల నుంచి ఇంతటి క్రేజ్ ను... డిమాండ్ ను తెచ్చుకోవడం నిజంగా గొప్ప విషయమే.

# మోహన్ బాబు గురించి వస్తున్న వార్తల్లో నిజం లేదు

## : సినీ నటి సౌందర్య భర్త



సినీ నటి సౌందర్యకు సంబంధించి నటుడు మోహన్ బాబుపై పలు వార్తలు ఇటీవలి కాలంలో తెరపైకి వస్తున్నాయి. సౌందర్య మరణం ప్రమాదవశాత్తు జరిగింది కాదని... ఆమెను పక్కాగా ప్లాన్ చేసి చంపేశారంటూ ఖమ్మం జిల్లాకు చెందిన ఒక వ్యక్తి ఇటీవల నిరసనకు దిగారు. మోహన్ బాబుపై సంచలన ఆరోపణలు చేశారు. దీనికి సంబంధించి ఫిర్యాదు కూడా చేశారు. హైదరాబాద్ జల్ పల్లిలో ఉన్న ఫామ్ హౌస్ ని కూడా తన అదుపులో ఉంచుకుని మోహన్ బాబు అనుభవిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సౌందర్య భర్త రఘు స్పందించారు. హైదరాబాద్ లోని ఒక ప్రాపర్టీ గురించి మోహన్ బాబు పేరును అనవసరంగా ప్రస్తావిస్తున్నారని రఘు చెప్పారు. ఆ వార్తలన్నీ అవాస్తవాలేనని అన్నారు. తన భార్య సౌందర్య ఆస్తులను మోహన్ బాబు చట్ట విరుద్ధంగా స్వాధీనం చేసుకోలేదని చెప్పారు. మోహన్ బాబుకు, తమకు మధ్య ఎలాంటి ఆస్తి లావాదేవీలు లేవని అన్నారు.

తన భార్య, అత్త, బావమరిది ఆయనతో మంచిగా ఉండేవారని తెలిపారు. సౌందర్య మరణించిన తర్వాత కూడా... ఆయనతో తమకు మంచి స్నేహం ఉందని చెప్పారు. మోహన్ బాబుపై అసత్య వార్తలు వస్తున్న నేపథ్యంలోనే తాను అసలు విషయాలు ఏమిటో చెప్పాలనుకున్నానని తెలిపారు. ఇలాంటి తప్పుడు కథనాలను ప్రచురించవద్దని కోరారు. సాఫ్ట్ వేర్ ఇంజినీర్ గా పని చేస్తున్న రఘును 2003లో సౌందర్య పెళ్లి చేసుకున్నారు. 2004లో హెలికాప్టర్ ప్రమాదంలో ఆమె దుర్మరణం చెందారు. 2004 లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ తరపున సౌందర్య ప్రచారం చేశారు. ఎన్నికల ప్రచారం కోసం బెంగళూరు నుంచి కరీంనగర్ కు బయల్దేరిన వెంటనే హెలికాప్టర్ క్రాష్ అయింది. ఈ ప్రమాదంలో ఆమె సజీవదహనం అయ్యారు.



# వేసుకునే ది ఖరీదైన బట్టలు.. తినేది మాత్రం నూడుల్స్

: మోడల్ గా కెరీర్ ను మొదలుపెట్టిన బాలీవుడ్ నటి దియా మీర్జా మాజీ మిస్ ఆసియా ఫసిఫిక్ ఇంటర్నేషనల్2001 విన్నర్ అనే విషయం తెలిసిందే. సమాజ సేవ చేస్తూ ఎక్కువగా గుర్తింపు దక్కించుకున్న దియా మీర్జా హీరోయిన్ గా పలు సినిమాల్లో నటించింది. కానీ దియా హీరోయిన్ గా పెద్దగా పేరు సంపాదించుకోలేకపోయింది. ఇదిలా ఉంటే రీసెంట్ గా దియా మీర్జా తాను మోడలింగ్ లోకి వచ్చిన కొత్తల్లో తాను పడిన ఇబ్బందులు, ఎదుర్కొన్న సవాళ్ల గురించి మాట్లాడింది. మొదట్లో తాను డబ్బు లేక చాలా ఇబ్బంది పడ్డానని, ఫ్యామిలీ నుంచి ఎలాంటి సపోర్ట్ ఉండేది కాదని, చాలీచాలని డబ్బుతో జీవితాన్ని నెట్టుకొచ్చినట్టు తెలిపింది దియా మీర్జా. 2000వ సంవత్సరంలో తాను, లారా దత్తా, ప్రియాంక చోప్రా మిస్ ఇండియా పోటీల్లో పాల్గొన్నామని ఆమె చెప్పింది. ప్రియాంకకు తన ఫ్యామిలీ నుంచి ఫుల్ సపోర్ట్ ఉండేదని, లారా దత్తాకు, తనకు ఇంట్లో వారి సపోర్ట్ ఉండేది కాదని చెప్పింది. మోడలింగ్ చేస్తున్న టైమ్ లో ముంబైలో ఓ చిన్న రూమ్ లో లారా రెంట్ కు ఉండేదని, తాను ముంబైకు వచ్చినప్పుడు లారా చాలా హెల్ప్ చేసేదని, లారా ఇంట్లోనే తాను కూడా ఉండేదని చెప్పింది. చిన్న ఇల్లు అయినప్పటికీ ఇద్దరం అందులోనే అడ్జస్ట్ అయిపోయేవాళ్లమని, ఫ్యాషన్ షో లో పాల్గొనడానికి ఖరీదైన బట్టలు వేసుకున్నప్పటికీ తినడానికి చేతిలో చిల్లి గవ్వ కూడా ఉండేది కాదని, నూడుల్స్ తిని కడుపు నింపుకునే వాళ్లమని, వేసుకునేది ఖరీదైన బట్టలు, తినేది మాత్రం నూడుల్స్ అని తమ పరిస్థితిని చెప్పుకుని తాను, లారా నవ్వుకునేవాళ్లమని దియా మీర్జా ఆనాటి రోజుల్ని గుర్తు చేసుకుంది. మిస్ ఇండియా పోటీల్లో లారా దత్తా విన్నర్ గా నిలవగా, ఫస్ట్ రన్నరప్ గా ప్రియాంక చోప్రా, సెకండ్ రన్నరప్‌గా దియా మీర్జా నిలిచారు. 2001లో రెహ్నా హై తేరే దిల్ మే సినిమాతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన దియా మీర్జా ఆ తర్వాత బాలీవుడ్ లో పలు సినిమాల్లో నటించింది. 2021లో నాగార్జున తో కలిసి వైల్డ్ డాగ్ సినిమా చేసి తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన దియా మీర్జా మోడల్‌గా, నటిగా, నిర్మాతగా అన్నింటికీ మించి సమాజ సేవకురాలిగా బాగా గుర్తింపు దక్కించుకుంది.

## ఇండస్ట్రీకి వచ్చి సెటిల్ కానివారికి

# కిరణ్ అబ్బవరం అండ



యువ కథనాయకుడు కిరణ్ అబ్బవరం ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం దిల్‌రుబా. ఈ సినిమాకి విశ్వ కరుణ్ దర్శకత్వం వహిస్తుండగా.. రవి, జోజో, జోస్, రాకేష్ రెడ్డి నిర్మిస్తున్నారు. రుక్సర్ థిల్లాన్ కథానాయికగా నటిస్తుండగా.. మార్చి 14న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది చిత్రయూనిట్. అయితే ఈ వేడుకలో కిరణ్ మాట్లాడుతూ.. ఇండస్ట్రీక్రి వచ్చి ఇబ్బంది పడుతున్న వారికి నేను తోడుంటానని తెలిపాడు. హైదరాబాద్‌లోని కృష్ణ నగర్‌కి నేను వచ్చినప్పుడు నాతో పాటు 50 మంది ఉండేవాళ్లం. అందరం కలిసి పనిచేయాలని చెప్పి బావార్చి దగ్గర కలిసేవాళ్లం. స్టోరీలు చెప్పుకునేవాళ్లం. అయితే రోజురోజుకి మా సంఖ్య తగ్గి 50 నుంచి 10కి పడిపోయింది. ఇప్పుడయితే ఇద్దరు ముగ్గురు కూడా కనిపించట్లేదు. దీనికి కారణం ఏంటి అంటే అవకాశలు రావడం. అవకాశం వచ్చిన వాళ్లు ఇక్కడనే సెటిల్ అవుతారు. కానీ అవకాశలు రాకుండా అలానే మిగిలిపోయిన వాళ్లు ఇంటికివెళ్లిపోతున్నారు. సినిమాలు అంటే పేరెంట్స్‌కి కూడ నమ్మకం లేదు. అందుకే ఇండస్ట్రీక్రి వచ్చి ఇబ్బంది పడుతున్న వారికి నేను తోడుండాలి అనుకుంటున్నాను. నేను ఇప్పుడు చిన్న హీరోనే కానీ నాకు తోచినంతా సాయం చేయడం చేస్తాను. ప్రతి సంవత్సరం సినిమా అంటే పిచ్చి ఉండే 10 మంది వ్యక్తులకు నేను ఆర్థిక సాయం చేయడమే కాకుండా ఆదుకుంటాను. కొత్త వారిని ఇండస్ట్రీలోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాను. నా సినిమాలలో కూడా కొత్తవారికి అవకాశం ఇవ్వమని నిర్మాతలను అడుగుతాను. నాకంటే టాలెంట్ ఉన్నవాళ్లు చాలమంది బయట ఉన్నారు. నాకు అవకాశం వచ్చింది. మీకు రేపు అవకాశం రావచ్చంటూ కిరణ్ చెప్పుకోచ్చాడు.